ప్రజాశక్తి
ఆదివారం 2 జులై 2023
5
పార్వతీపురం మన్యం



## పంటల బీమాకు రూ.6.59 కోట్లు విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా ఖరీఫ్-22కు గానూ 151 రైతు భరోసా కేంద్రాల్లోని 10,978 మంది రైతులకు రూ.6.59 కోట్లు మంజూరు కానున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ బీమా సొమ్మును ముఖ్యమంత్రి ఈనెల 8న రైతుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. ప్రధానంగా అరటి, మొక్కజొన్న పంటలకు ఉచిత పంటల బీమా వచ్చిందన్నారు. వాతావరణ ఆధారిత పంటల బీమా అరటి పంటకు కూడా వర్తించిందన్నారు. అరటి పంటకు జిల్లాలో రూ.5.21 కోట్లు వచ్చిందని, దిగుబడి ఆధారిత పంటల బీమా మొక్కజొన్న పంటకు రూ.1.38 కోట్లు వచ్చిందన్నారు. అర్హుల జాబితాను ఆర్‌బికెల్లో ప్రచురించామన్నారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తమ రైతు భరోసా కేంద్రంలో గల విఎఎకు ఈనెల 4 నాటికి గ్రీవెన్స్ ఇవ్వాలని సూచించారు.

# వైద్యరంగానికి నిధులు పెంచాలి


- అల్లోపతిలో అశాస్త్రీయ విధానం సరికాదు
- ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభలో వక్తలు
- ప్రజాశక్తి ఆధ్వర్యాన డాక్టర్స్‌డే వేడుకలు



డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు, వైద్యులు పద్మలీల, విఎస్ ప్రసాద్, అప్పలనాయుడు, తిరుమల ప్రసాద్, కృష్ణశాంతి, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, మెడికల్స్ రిప్స్ యూనియన్ నాయకులు రవికుమార్, మేనేజర్ కామినాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగానికి నిధులు పెంచి, జనాభా నిష్పత్తికి అనుగుణంగా వైద్యులను, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. డాక్టర్స్‌డే వేడుకలు శనివారం ప్రజాశక్తి దినపత్రిక ఆధ్వర్యంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసి నాయుడు, పూర్వ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్, తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్, రోటరీ నూతన అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి, ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు ఆవిష్కరించారు. అంతకుముందు వైద్య పితామహుడు డాక్టర్ బిసి రాయ్ చిత్రపటానికి అతిథులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో డిఎంహెచ్ఒ మాట్లాడారు. డాక్టర్ బిసి రాయ్ సేవలను స్మరించుకోవడమంటే ఆయన మార్గంలో పయనించడమని, వృత్తి పరంగా ఆయనను అనుసరించాలని అన్నారు. వైద్యుడికి సేవలో రోగిని బతికించిన తర్వాత తృప్తి పొందే వ్యక్తులలో వైద్యులు ముఖ్యులన్నారు. వైద్యవృత్తితో పాటు ఆయన మార్గంలో పయనించి సేవలు అందించడం కోసం స్ఫూర్తిని కొనసాగిస్తామని అన్నారు.



సభలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

డాక్టర్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ డాక్టర్ల సేవలను, సమస్యలను గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాశక్తి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల్లో రక్తహీనత, కేన్సర్ వంటి జబ్బులు పెరిగిపోతున్నాయని, వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతయినా ఉందని అన్నారు. ప్రజలు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. ఆ దిశగా ప్రజాశక్తి అవగాహన కల్పించాలని కోరారు.

### వైద్య కళాశాలతో మెరుగైన వైద్యసేవలు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల మాట్లాడుతూ దేశంలో జనాభా నిష్పత్తి ప్రకారం వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని, కానీ అందుకు అనుగుణంగా లేరని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు విస్తరిస్తాయని తెలిపారు. వైద్యులు విలువతో కూడిన వైద్యం అందించాలన్నారు. ప్రజల జీవన విధానంలో మార్పు వస్తే ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. ప్రజల్లో కేన్సర్ పట్ల అవగాహన కల్పించడం అవసరమన్నారు.

### వైద్యరంగానికి నిధులు పెంచాలి

యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ క్యూబాలో ప్రతి వెయ్యి మందికి 9 మంది వైద్యులు ఉన్నారని, మనదేశంలో వెయ్యి మందికి ఒకరు కూడా లేరని అన్నారు. వైద్యులపై భౌతిక దాడులు సరికాదన్నారు. వైద్యరంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాల్సి ఉందన్నారు. ప్రభుత్వ విధానాలు కారణంగా మనకి కష్టాలు తప్ప వైద్యులు కాదనేది తెలుసుకోవాలన్నారు. అల్లోపతిలో అశాస్త్రీయ విధానాలను ఖండించాలన్నారు.

### వైద్యులపై దాడులు సరికాదు

డాక్టర్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వైద్యులపై భౌతిక దాడులు సమాజానికి నష్టదాయకమన్నారు. వైద్య విద్యను అభ్యసించడానికి కారణం వైద్యసేవలను అందించేందుకు తప్ప వ్యాపార దృక్పథంతో కాదన్నది గ్రహించాలని అన్నారు. వైద్యరంగంలో అశాస్త్రీయ అంశాలను చేర్చడం వల్ల రానున్న కాలంలో వైద్యులు తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అశాస్త్రీయ వైద్య విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్తే సమాజం ప్రమాదంలో పడుతుందన్నారు. వైద్య రంగానికి తగినన్ని నిధులిచ్చి ప్రోత్సహించాలన్నారు. ఆధునిక వైద్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్య కరమైన సమాజం ఏర్పడుతుందన్నారు.

ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసి నాయుడు మాట్లాడుతూ ప్రజలు వైద్యులపై నమ్మకం కలిగి ఉంటే మెరుగైన సేవలు అందుతాయన్నారు.

### అందరికీ హెల్త్ ఎడ్యుకేషన్ అవసరం

డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ సేవ చేయాలనే భావం ఉంటేనే వైద్య వృత్తిలోకి రావాలన్నారు. ప్రస్తుత రోజుల్లో టీమ్ ప్రాక్టీస్ చేయాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వాలు 2శాతం మించి బడ్జెట్ ఇవ్వలేని పరిస్థితిలో ఖరీదైన వైద్యం సాధ్యం కావడం లేదన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాయామాలు, హెల్త్ పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని తెలిపారు.

### వైద్యులు ప్రాణదాతలు

ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు మాట్లాడుతూ వైద్య వృత్తి గౌరవప్రదమైనదని, దానికి విలువ కట్టి చూడలేమని అన్నారు. తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. అటువంటి వైద్యులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ వైద్యం పేదలకు అందేలా చూడాలన్నారు. అశాస్త్రీయ వైద్య విధానాన్ని ప్రజాశక్తి ప్రోత్సహించేది లేదన్నారు.

ఎడిషన్ మేనేజర్ కామినాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి వ్యాపార దృక్పథంతో కాకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వైద్యరంగంలో డాక్టర్‌బిసి రాయ్ అందించి సేవలు ఎనలేనివన్నారు. రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రజాశక్తి విలేకర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ అప్పలనాయుడును సత్కరిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు, విఎస్ ప్రసాద్



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

## ఓనిగెడ్డ ఆధునీకరణకు సిఎం అంగీకారం

**రిజర్వాయర్ ప్రాంతాన్ని సందర్శించిన స్పీకర్ తమ్మినేని**
**ఖరీఫ్‌కు సాగునీరు అందించేలా చర్యలు**

ప్రజాశక్తి - పాలకొండ/పాలకొండ రూరల్

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ప్రధానమైన సాగునీటి వనరుల్లో ఓనిగడ్డ రిజర్వాయర్ దశాబ్దాల కాలంగా రైతులకు వర ప్రధాయినిగా నిలుస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం ఆయన రిజర్వాయర్ ఉన్న వెలగవాడలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్, ఇరిగేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. సహజ సిద్ధమైన కొండల నుంచి వచ్చే నీటిని నిలువ చేసేలా దశాబ్దాల క్రితం రిజర్వాయర్ నిర్మాణం జరిగిందన్నారు. 0.3 టీఎంసీల సామర్థ్యం గల నీటిని ఈ రిజర్వాయర్‌లో నిల్వ చేసుకొనే అవకాశం ఉండేదన్నారు. పాలకొండ మండలంలో 2వేల ఎకరాలకు, బూర్జ మండలంలో 7వేల ఎకరాలకు సాగునీరు అందించి, రెండు మండలాల రైతులకు ఉపయుక్తకరంగా నిలుస్తుందన్నారు. నీటి ప్రవాహం ద్వారా వచ్చే మట్టి రిజర్వాయర్లో కూరికిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, దీంతో కాలువలో ప్రవాహం తగ్గి, రైతులకు సాగుకు ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కాలువ ప్రాంతం జంగిల్స్‌తో నిండిపోవడం వల్ల రైతులకు సాగునీరందే పరిస్థితులు గగనం అయ్యాయన్నారు. ఈ ఇబ్బందులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రిజర్వాయర్‌ను, ఆధునికరిం చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరగా, సిఎం సానుకూలంగా స్పందించారన్నారు. అప్పట్లో అధికారులు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు రూ.12 కోట్లు విడుదలకు అంగీకారం తెలిపారన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సాగునీరు కల్పనకు, ఇరు జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన ఇరు జిల్లాల కలెక్టర్లు ఓనిగడ్డ నిర్మిత ప్రాంతం, పరివాహక ప్రదేశానికి వచ్చినందుకు సభాపతి అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం కలెక్టర్ మాట్లాడుతూ ఇరు జిల్లాల్లో రెండు మండలాల రైతాంగానికి ఎంతో ప్రయోజనకరంగా నిలిచే ఓనిగడ్డ రిజర్వాయర్ ఆధునీకరుణకు జిల్లా యంత్రాంగం తరపున సహకరిస్తామని తెలిపారు. జంగిల్స్ తొలగించి పూర్తిస్థాయి సాగునీరు అందేలా చర్యలకు ఉపక్రమించాలని ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్‌ను కోరారు. ఇందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బూర్జ మండలంలో కాలువ శివారు ప్రాంతానికి సాగు నీరందేలా చర్యలు చేపడతానని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా మాట్లాడుతూ ఓనిగెడ్డ రిజర్వాయర్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరిం చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. 0.3 టిఎంసిలు నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, రిజర్వాయర్‌లోనే మేట వేసిన మట్టి కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు తాత్కాలికం గా రిజర్వాయర్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే చర్యలు వేగవంతం చేస్తామన్నారు. రిజర్వాయర్ ఉన్న ప్రాంతంలో గరిష్ట నీటినిల్వల సామర్థ్యం పెంచేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవా లని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే వి.కళావతి, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, అనధికారులు పాల్గొన్నారు.

## నేడు జెవివి ఆధ్వర్యాన సైన్స్ వాక్

ప్రజాశక్తి-విజయనగరం

రద్దు చేసిన సైన్సు అవార్డులను పునరుద్ధరించాలని, శాస్త్ర పరిశోధనా సంస్థలకు తగినన్ని నిధులు కేటాయించాలని, పాఠశాలల సిలబస్ నుంచి తొలగించిన శాస్త్రీయ అంశాలను తిరిగి చేర్చాలని కోరుతూ ఆదివారం నగరంలో సైన్సు వాక్ నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణప్రభాత్ తెలిపారు. ఉదయం 9గంటలకు గురజాడ స్వగృహం నుంచి అంబేద్కర్ భవనం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మేధావులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ముగ్గురే గిరిజన డిప్యూటీ డైరెక్టర్

- ఐటిడిఎ చరిత్ర లో గిరిజనేతరులే ఎక్కువమంది
- ఎట్టకేలకు డిడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సాలూరు

ఐటిడిఎ చరిత్రలో కేవలం ముగ్గురే గిరిజన అధికారులు డిప్యూటీ డైరెక్టర్లుగా పని చేసినట్లు తెలుస్తోంది. 1982 నుంచి జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పిలిచేవారు. అప్పటి నుంచి 2009వరకు డిటిడబ్ల్యుఒలే పని చేశారు. 2009 నుంచి డిప్యూటీ డైరెక్టర్‌గా నామకరణం చేశారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారులుగా, డిప్యూటీ డైరెక్టర్లుగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో పని చేసిన అధికారుల్లో కేవలం ముగ్గురు మాత్రమే గిరిజన అధికారులు. 1992లో గిరిజన అధికారి బాబూ బుక్యా డిటిడబ్ల్యుఒగా పని చేశారు. 2009లో మరో గిరిజన అధికారి మోహన్ నాయక్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత డిప్యూటీ డైరెక్టర్‌గా నియామకమైన తొలి గిరిజన అధికారి కె.శ్రీనివాసరావు మాత్రమే. 14 ఏళ్ల తర్వాత గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఎట్టకేలకు పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణు చరణ్ సీనియర్ ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావును డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖపై గిరిజనేతరుల పెత్తనమే కొనసాగింది. చాలా కాలం తర్వాత మొదటిసారి గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా గిరిజన అధికారి నియామకంపై గిరిజన సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిడి శ్రీనివాసరావు

## కెజిబివిని సందర్శించిన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థుల్లో కడిగిన ఆణిముత్యాలు ఉన్నాయని తన ప్రసంగంతో మనస్విని రుజువు చేసిందని కస్తూరిబా పాఠశాలల జాయింట్ సెక్రెటరీ ఎన్.గీత అన్నారు. స్థానిక కస్తూరిబా పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించాలని అన్నారు. మనస్విని ప్రసంగంతో కెజిబివి పాఠశాల పేరు ప్రఖ్యాతలు రాష్ట్రం నలుమూలల వ్యాపించాయన్నారు. విద్యార్థులకు తరగతుల నిర్వహణ, మెనూ అమలు తీరు పరిశీలించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా ఎజిసిడిఒ కె.రోజారమణి, ప్రిన్సిపల్ శ్రీరంజని ఉన్నారు.

### కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని బాబామెట్టలోగల కేంద్రీయ విద్యాలయం బాలవాటిక-3 తరగతి లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటిక-3 లో ప్రవేశానికి ఐదేళ్ల వయస్సు వచ్చి ఆరేళ్లు నిండని పిల్లలు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జులై 6 ఉదయం 9గంటల నుంచి ప్రారంభమవుతుందని, 18వ తేదీ రాత్రి 7 గంటలకు ఆఖరని తెలిపారు. విద్యార్థుల ఆన్‌లైన్ ఎంపిక ప్రక్రియ ఈనెల 20న జరుగుతుందని, 29 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు విద్యాలయ వెబ్‌సైటు http://vizianagaram.kvs.ac.in చూడాలని తెలిపారు.



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

## జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - సాలూరు

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలు సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 1,2 సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మెంటాడవీధి కల్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజన్నదొర మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలకు సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలు, పిల్లల చదువు కోసం అవసరమైన ధ్రువపత్రాలను వెనువెంటనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గడచిన నాలుగేళ్లలో 800 ధ్రువపత్రాలు మంజూరైతే ఈ ఒక్క రోజే 900 ధ్రువపత్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. మొన్నటి వరకు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో తిరిగినప్పుడు చాలా వరకు సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. ఇంకా మిగిలిన సమస్యల్ని ఈ కార్యక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. సాధారణంగా ఈ ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతుంటారని, ఇప్పుడు ఆ కార్యాలయాలే ప్రజల వద్దకు వస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు గానీ, ధ్రువపత్రాలు గానీ అత్యంత పారదర్శకంగా పంపిణీ చేస్తున్న ప్రభుత్వం తమదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ ఛైర్మన్ లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్ లు, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు

**జూనియర్ సివిల్ జడ్జి వాణి**

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్న ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తప్పవని జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి హెచ్చరించారు. ప్రయివేటు స్కూల్లో యాజమాన్యం మొదట నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేసినట్లు పట్టణానికి చెందిన పి.రమణబాబు శనివారం స్థానిక మండలం న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు అందజేశారు. ప్రయివేటు స్కూల్ యాజమాన్యానికి నోటీసు ద్వారా పిలిపించి సమస్య అడిగి తెలుసుకుని రాజీ మార్గంలో పరిష్కారం చూపారు. అధికంగా వసూలు చేసిన మొత్తం తిరిగి పి.రమణబాబుకు ఇప్పించారు.



సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

## పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి - కొమరాడ

పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారాలు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం స్థానిక మండల విద్యుత్ శాఖ అధికారి జి.రమణకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిసి ప్రజలపై తీవ్ర భారాల వేస్తున్నాయన్నారు. త్వరలో స్మార్ట్ మీటర్లు తోపాటు సర్దుబాటు, ట్రూ అప్ కాలర్ అని రకరకాల పేరుతో సామాన్యుల నుండి డబ్బులు దోచుకుని కార్పొరేటర్ జేబులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నింపుతున్నాయని విమర్శించారు. తక్షణమే పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పోలాడ లక్ష్మణరావు, సింహాచలం, వెంకటనాయుడు, శ్రీనివాసరావు, ఫకీర్ నాయుడు పాల్గొన్నారు.

## భూముల బండారం బయటపడేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి




ఇటీవల చర్చనీయాంశంగా మారిన ప్రభుత్వ భూముల ఆక్రమణల బండారం బయటపడుతుందా? వివాదాలు బయటపెట్టిన ఎమ్మెల్సీ మాటపై నిలబడి నిగ్గుతేలుస్తారా? లేక చాలా మంది రాజకీయ నాయకులు చెప్పుకుంటున్నట్టు ఇదంతా కొందరు రాజకీయ నాయకులు కలిసి చేస్తున్న మైండ్ గేమా? అన్నది జిల్లాలో నేడు హాట్‌హాట్ పబ్లిక్ టాక్‌గా మారింది. ఇటీవల జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఎస్.కోట నియోజకవర్గంలో చాలా వరకు భూ ఆక్రమణలు ఉన్నాయంటూ బాహాటంగా ప్రకటన చేసిన విషయం విధితమే. తాటిపూడికి సమీపంలో తాను ఇటీవల ప్రారంభించిన లేఅవుట్‌లో కూడా ఆక్రమణలు ఉన్నట్టు ఆలస్యంగా తెలుసుకున్నానంటూ నాలుక కరుచుకున్నారు. ప్రారంభానికి ముందు ఎలాంటి అభ్యంతరాలు లేవని అధికారులు చెప్పడంతోనే తాను వెళ్లానని, తీరా ఇప్పుడు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్టు అధికారులు బోర్డులు పెట్టారని కూడా వివరణ ఇచ్చారు. దీంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, త్వరలోనే ఆ చిట్టా జిల్లా మీడియాకు వెల్లడిస్తానని కూడా ఎమ్మెల్సీ హెచ్చరించారు. సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీయే ఆక్రమణల కోసం ఆగ్రహంతో మాట్లడడంతో జిల్లా వ్యాప్తంగా సంచలనమైంది. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురయ్యాయనేది ఎమ్మెల్సీ ఎప్పుడు చెబుతారా? అని ఆద్యంతం ఎదురు చూస్తోంది. ఆక్రమణల చిట్టా విప్పేందుకు ఆషాడం అడ్డొచ్చిందా? అంటూ వ్యంగ్యంగా స్పందిస్తున్న వారూ లేకపోలేదు. సాక్షాత్తు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే బంధువులు వేసిన లేఅవుట్ గుట్టు విప్పడమే గొప్ప విషయమని మరికొందరు అంటున్నారు. మరోవైపు ప్రభుత్వ భూములు పరిరక్షించాలని ఎమ్మెల్సీ అడుగుతుండగా దీన్ని ఎమ్మెల్సీ, స్థానిక ఎమ్మెల్యేల మధ్య వైరంగా మీడియా చిత్రీకరిస్తోందని మరికొందరి వాదన. ఇదంతా స్థానిక ఎమ్మెల్యేపైకి నెట్టేసి, వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఖాళీ చేయించేందుకు ఓ నేత దర్శకత్వంలో సాగుతున్న హైడ్రామా అని ఇంకొందరి ఆవేదన.

వాస్తవానికి ఒక అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ భూ ఆక్రమణలు ఉన్నాయని ప్రకటన చేయడమంటే సాక్షాత్తు ప్రభుత్వం అంగీకరించినట్టే. దీనిపై స్పందించాల్సిన స్థానిక టిడిపి నాయకులు మౌనం వహించారు. వీరి మౌనం వెనుక రాళ్లగుట్ట భూ బాగోతం బయట పడుతుందనే భయం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు కూడా దీనిపై స్పందించకపోవడం గమనార్హం. దీంతో, ప్రతిపక్షం నిద్రపోతోందని జనం విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో భూ ఆక్రమణలపై ఎమ్మెల్సీ గళం గుట్టురట్టయ్యేవరకూ వినిపిస్తుందా? లేక కొన్నాళ్లకు అంతే సంగతులు అన్నట్టుగా సన్నగిల్లిపోతుందా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

## జువైనల్ జస్టిస్ బోర్డుల్లో సామాజిక కార్యకర్తల భర్తీకి చర్యలు

ప్రజాశక్తి - విజయనగరం

జువైనల్ జస్టిస్ బోర్డుల్లో ఛైర్ పర్సన్లు, మెంబర్లు, సామాజిక కార్యకర్తలుగా నియమించేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణాధికారి ఎం. శరత్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివి ఏదైనా స్వచ్ఛంద సంస్థల్లో ఏడేళ్లకు పైగా పని చేసి, 35 నుంచి 65 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎంపికైన వారికి జువైనల్ యాక్టు నిబంధనల ప్రకారం గౌరవ వేతనం అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత పత్రాలతో పాటు ఈనెల 13లోగా దరఖాస్తును సమర్పించాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తును స్పీడ్ పోస్టు లేదా రిజస్టర్డ్ పోస్టు ద్వారా డైరెక్టర్, డిపార్ట్మెంట్ ఆఫ్ జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్, కేరాఫ్ గవర్నమెంట్ అబ్జర్వేషన్ హోం ఫర్ బాయ్స్, డోర్. నెం.3-1-265/4ఎ, కబేళా సెంటర్ దరి, రోటరీ నగర్, విద్యాధరపురం, విజయవాడ-520012 చిరునామాకు పంపించాలని తెలిపారు. ఇతర వివరాలను http://wdcw.ap.gov.in అనే వెబ్ సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు.

# ప్రజలకు సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన సేవలన్నింటినీ అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం శనివారం ఆయన ప్రారంభించారు. పార్వతీపురం పట్టణం వివేకానంద కాలనీ, కొమరాడ, మక్కువ మండలం వెంకట భైరిపురం సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. జగనన్న సురక్ష పథకం అమలు, ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ప్రజలకు టోకెన్లు జారీ, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా అందుతున్న సేవలపై కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా సేవలను ప్రతి ఒక్కరికీ అందించాలని, ప్రతి ఇంటికీ వెళ్లి వారి అవసరాలను తెలుసుకోవాలన్నారు. ఏ ఇంటిని కూడా విడిచి పెట్టకుండా, ప్రతి ఇల్లు, ప్రతి కుటుంబం సర్వే చేయాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అర్హులైన ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి ధ్రువపత్రాలను జారీ చేసి, పథకాలను అందించాలని తెలిపారు. జగనన్న సురక్ష పథకం ద్వారా మంజూరు చేసిన ధ్రువపత్రాలను కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి కావాల్సిన ధ్రువపత్రాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నందుకు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

**పార్వతీపురంరూరల్ :** మండలంలోని పెదబొండపల్లి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. గత వారం రోజులుగా గ్రామంలో గల ప్రతి ఇంటికీ వాలంటీర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులంతా కలిసి వెళ్లి కుటుంబంలో గల ప్రతి సభ్యుడ్ని కలిసి సమస్యలుంటే అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న 11 సేవల్లో భాగంగా అర్జీ పెట్టుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో సంబంధిత ధ్రువపత్రాలు అందజేశారు. ఈ క్యాంపు కార్యక్రమంలో అర్జీ పెట్టుకున్న సుమారుగా 347 మంది లబ్ధిదారులకు కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, రైస్ కార్డ్, ఆధార్ అప్డేషన్ సంబంధిత ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఇవేకాకుండా ఇంకే సమస్యలున్నా సరే వాటిని కూడా జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుంది అని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి, మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు,


పార్వతీపురం: ధృవపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం


కొమరాడ: వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

మండలం అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**కురుపాం :** సచివాలయం పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కారం చూపేందుకే జగనన్న సురక్ష పథకమని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సేవలను అందించడం జరుగుతుందని అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారి కోసమే ఈ పథకం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీ వి.బంగారు నాయుడు, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర్, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, ఉప తహశీల్దార్ బి.నాగేశ్వరరావు, పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

**సీతానగరం :** మండలంలోని అంటిపేట సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీస్తూ గ్రామంలో అర్జీలు పెట్టుకున్న అంతమందికీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారా లేదా అని తెలుసుకుని తన చేతులు మీదుగా కొద్ది మంది లబ్ధి దారులకు వివిధ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, కన్వీనర్లు, గహసారధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట** : మండలంలోని చిన్నబగ్గలో జగనన్న సురక్ష కార్యక్రమం సచివాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 11 అంశాలపై అధికారులు ప్రజలకు అవసరాల మేరకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేట్ ఇంజనీర్ ఎస్.సింహాచలం, తహశీల్దార్ నరసింహమూర్తి, ఆర్ఐ వెంకటేష్, సర్పంచ్ నీలయ్య, ఎంపిటిసి మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం** : జగనన్న సురక్ష పథకం ద్వారా సేవలను ప్రతి ఒక్కరికీ అందించాలని, ప్రతి ఇంటికీ వెళ్లి అవసరాలను తెలుసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు అధికారులకు సూచించారు. గుమ్మలక్ష్మీపురం, కేదారిపురం సచివాలయాల పరిధిలో శనివారం ప్రారంభించిన జగనన్న సురక్ష శిబిరాలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. అర్హులుగా ఉండి పథకాలు అందని వారు ఉంటే వారికి ధృవపత్రాలు జారీ చేసి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురంలో అర్హులుగా ఉండి పథకాలు అందని వారికి ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాములమ్మ, పంచాయతీ విస్తరణ అధికారి జగదీష్ కుమార్, హౌసింగ్ ఎఇ రెడ్డి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ జెఇ మురళీధర్, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి గిరిబాబు, సర్పంచ్ గౌరీ శంకర్రావు, ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి:** మండలంలోని రావివలస గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అమ్మడమ్మ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వవ పథకాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను ఈ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ రావు, ఇఒపిఆర్‌డి గోపాలకృష్ణరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**భామిని:** ప్రతీ సమస్య పరిస్కారం చేసి, ప్రజలకు సేవ చేయడానికే జగనన్న సురక్ష కార్యక్రమం అని జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ తెలిపారు. భామిని సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ చంద్రరావు, బిడ్డికి కృష్ణారావు, రొక్కం రమేష్, పోతల మజ్జి, సంజీవ్‌రావు పాల్గొన్నారు.

**వీరఘట్టం:** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం పథకం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. శనివారం మండలంలోని చలివేంద్రి, రేగులపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్ సుదర్శన్ రావు, ఎం ఉషారాణి, మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, మండల ఉపాధ్యక్షులు పి విజయకుమారి, ఎంపిటిసి పోరెడ్డి వెంకట నాయుడు, సచివాలయ కార్యదర్శి శ్యామ్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి



విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

## విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విశాఖకు చెందిన అయ్యావారి నరసింహులు జయంతి పురస్కరించుకొని 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం నగదును పంపిణీ చేశారు. అధిక మార్కులు సాధించిన చక్కాపు భవాని, పద్మశ్రీ, కె రాజేశ్వర్‌లను సత్కరించి నగదు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రోత్సహించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఐ ప్రసన్నలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రామారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

## టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక వెలమ వీధికి చెందిన బొబ్బిలి రాజు అనుచరులు సంకరాపల్లి రామారావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, ఆర్.వేణుగోపాలనాయుడు, బుర్తి శ్రీనివాసరావు, బోను చంటి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి పరామర్శించారు.


సీతంపేట: విరాళాలు సేకరిస్తున్న నాయకులు

## పోలవరం సంఘీభావ నిధి సేకరణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పోలవరం నిర్వాసితుల సంఘీభావ నిధుల సేకరణ సిపిఎం నాయకులు శనివారం సేకరించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి సిపిఎం పోలవరం పోరుకేక మహాపాదయాత్ర చేపట్టిందన్నారు. ఈ పాదయాత్ర విజయవంతానికి ప్రజలంతా తమ సహాయ సహకారాలు అందించాలని సిపిఎం నాయకులు కోరుతూ నిధులు సేకరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి హారిక భాస్కరరావు, అప్పారావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**పాలకొండ రూరల్:** పొలవవరం పోరు యాత్ర సంఘీభావ నిధి సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ధావాల రమణారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ అని లక్షల ఎకరాలు భూములకు నీరందిస్తుందని, వేల కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నాయని, 3 లక్షల ఎకరాల భూమిని నిర్వాసితులు త్యాగం చేస్తుంటే వారికి నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వడం లేదని చెప్పారు. నష్టపరిహారం ఇచ్చేవరకు జరిగే పోరాటానికి ప్రజలందరూ సహాయం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాదా రాము, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ నగర పంచాయతీ కమిటీ అధ్యక్షుడు కార్యదర్శి పడాల భాస్కర్ రావు, చింతల సంజీవి, చింతల సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న ఉద్యోగులు

## ఘనంగా వార్షికోత్సవం


ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

108, 104, 102 సేవలు ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులంతా మూడో వార్షికోత్సవ సంబరాలను స్థానిక ఎపి ఎన్జీఒ హోంలో నందు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 104 నోడల్ అధికారి డాక్టర్ వినోద్ పాల్గొన్నారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ద్వారా అందిస్తున్న 108, 104,102 ప్రజలకు మంచి సేవలు అందిస్తూ మంచి గుర్తింపును సాధించాయన్నారు. 108 జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గల సిబ్బంది అంకితభావంతో పని చేయడం వల్ల ప్రజలకు సేవలందించడంలో పార్వతీపురం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలాగే 104 జిల్లా మేనేజర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ 104 ఎఫ్‌పిసి ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది ప్రజలకు సేవలు అందిస్తూ, ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు, 108,104 ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు విజయ్ కుమార్, గిరిబాబు, రాజశేఖర్, ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## వరుణుడా.. కరుణించవా!

### ఆకాశం వైపు చూస్తున్న అన్నదాత

ప్రజాశక్తి - వీరఘట్టం


నీరులేక ఎండిపోతున్న నారుమడి

వరుణుడు కరుణించి వర్షం ఇస్తే పంటలు సాగు చేసుకుంటానన్న ఆలోచనతో అన్నదాతలు ప్రతిరోజు వరుణ రాక కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. మండలంలోని ఈ ఏడాది 17354 వేల హెక్టార్లో వరి సాగులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గణాంకాలు చెబుతున్నారు. కొన్నిచోట్ల విత్తనాలు చల్లి వరినారు మొలకెత్తినప్పటికీ, మరికొన్నిచోట్ల ఊబాలు లేకుండా ఉండేందుకు ట్రాక్టర్ల ద్వారా పంట పొలాలను చదును చేసుకొని విత్తనాలు చల్లారు. గత వారం రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో చల్లిన విత్తనాలు మొలకెత్తి తాయాలేదని? అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు అవసరమైన విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరకు కొనుగోలు చేసి విత్తనాలు చల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా ప్రభుత్వం తీరు ఉందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

## బిసి రాయ్ స్ఫూర్తితో పని చేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

బిసి రాయ్ స్ఫూర్తితో వైద్యులు ముందుకు వెళ్లాలని సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు అన్నారు. జూలై డాక్టర్స్ డే సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న బిసి రాయ్ విగ్రహానికి పూలమాలవేసి శనివారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులకు ఆదర్శం బిసి రాయ్ అని ఆయన అడుగుజాడల్లో పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేష్, గౌరీ శంకర్, వెంకట్రావు, రేఖ, నిరోషా, మనోజ్ పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం** : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్ కేక్ కట్ చేసి వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వృత్తి దైవంతో సమానమ న్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్యులు 24 గంటలపాటు రోగులకు సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రౌతు రవికుమార్, సిబ్బంది ఉన్నారు.


సీతంపేట: కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్

## శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - పాచిపెంట

పంటల్లో నిరంతర విశ్లేషణ చేస్తూ పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ ఆరోగ్యవంతమైన పంట పండించడంలో 14 వారాల శిక్షణ ఇస్తూ రైతును శాస్త్రవేత్తగా మార్చడమే డాక్టర్ వైయస్సార్ పొలంబడి లక్ష్యమని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మధుసూదనరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస రైతు భరోసా కేంద్రం పరిధిలోని చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన పొలంబడి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ మండలంలో చెరుకుపల్లి, అమ్మ వలసలో డాక్టర్ వైయస్సార్ పొలంబడులు మంజూరయ్యాయన్నారు. అమ్మవలసలో పత్తి పంట పొలంబడి అని 14 వారాలపాటు పంటల్లో వివిధ సాగు అంశాలను చర్చించడమే కాకుండా క్షేత్రస్థాయిలో పంట దశకు అనుగుణంగా చిన్నచిన్న ప్రయోగాలు నిర్వహిస్తూ నూతన సాంకేతిక మెలకువలను రైతులకు తెలియజేస్తూ సాగు ఖర్చులను తగ్గించి దిగుబడి పెంచేలా పొలంబడులు నిర్వహణ జరుగుతుందని, కావున రైతులంతా తప్పనిసరిగా పొలంబడికి హాజరు కావాలని అన్నారు. ప్రతి బుధ, గురువారాల్లో పొలంబడులు నిర్వహణ జరుగుతుందన్నారు. అనంతరం రైతులతో వరి పంటపై అవగాహన కల్పించే వైకుంఠపాళీ ఆటలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతిరావు, విఎఎ నాగమణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

## రక్తహీనత నివారణకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వైద్య సిబ్బంది అంగన్వాడి సిబ్బంది కృషి చేయాలని టిబీ నివారణ అధికారి డాక్టర్ శ్యామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య జిల్లా ఉపా ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న బొమ్మాళి అంజలికి సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం గ్రామాల్లో సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులు, బాలింతులు, చిన్నారులలో రక్తహీనత ఎక్కువగా లోపం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. వైద్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు గ్రామాల్లో సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు అరుణ్ కుమార్ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ శ్యామ్

## కేంద్రాల ఏర్పాటు

**కలెక్టరేట్:** జిల్లాలో జీడి, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని గిరిజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య జిల్లా మహాసభల నిర్వహణపై స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివారం పువ్వల ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో త్వరలో జరగబోయే గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలపై చర్చించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గిరిజనుల కోసం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, జీడి పరిశ్రమను ఏర్పాటు చేయాలని, పూర్ణపాడు - లబేసు వంతెన నిర్మించాలని, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, సవర భాషా వాలంటీర్లను నియమించాలని, హాస్టళ్లలో ఎఎన్ఎంలను నియమించి గిరిజన విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని, ఐటిడిఎ ఏర్పాటు చేసిన చెక్ డాంలకు మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలని డిమాండ్ చేశారు.

## బోర్డు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఆ కార్మికసంఘం మండల కార్యదర్శి పైల సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శని వారం భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కోసం 2009లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అనేక పథకాలు అందించారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తాడనుకున్న జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు రద్దు చేసి అనేక సంక్షేమ పథకాలు అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే కార్మికులకు మేలు చేస్తాడని భావించి ఓట్లు వేసిన భవన నిర్మాణ కార్మికులకు వైసిపి ప్రభుత్వం సరైన బుద్ధి చెప్పిందన్నారు. డబ్బులు జమ చేసినా ఇప్పటికే చాలా మందికి గుర్తింపు కార్డులు రాలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చిప్పాడ సుబ్బయ్య, పిసిని సత్యం పాల్గొన్నారు.

## టీకా కార్యక్రమాలను డిఐఒ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

టీకా కార్యక్రమం నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. శనివారం పట్టణంలో ఆయన 19వ వార్డులో గల వైకెఎమ్ కాలనీ, 20,21 చర్చి వీధి అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన టీకా కార్డులను పరిశీలించి గడువు తేదీలు పక్కగా నమోదు చేసి చిన్నారుల తల్లులకు తెలియజేయాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి తల్లులకు, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ద్రావణాన్ని డిఐఒ జగన్మోహనరావు వేసి, తర్వాత సిబ్బంది వేయడాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సావిత్రి, ఉమా మహేశ్వరి,అంగన్వాడీ సిబ్బంది జానకి, సుబ్బ లక్ష్మి , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..

### చలివేంద్రిలో ఫ్యామిలీ డాక్టర్

**వీరఘట్టం:** మండలం చలివేంద్రిలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, గర్భిణీలకు జ్వర పీడితలకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎంఎల్‌హెచ్‌పి లలిత, ఎఎన్ఎం జి.పైడితల్లి, టెక్నీషియన్ మాణిక్య కిరణ్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


పార్వతీపురం: రికార్డులను తనిఖీ చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు


## మలేరియా రహిత జిల్లా కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా రహిత జిల్లా కావాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జనసేన జిల్లా నాయకులు వంగల దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కొల్లి వెంకటరావు కోరారు. జిల్లాలో రోగాల సీజన్ ఆరంభమైందని, వర్షాలు కురవడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు జిల్లాలో అక్కడక్కడ నమోదవుతున్నాయని, కావున జిల్లా యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై దోమల నివారణకు అవసరమయ్యే ఎబేట్, ఎసిఎం ఐదు శాతం తదితర వాటిని గ్రామాలతో పాటు పట్టణ మురికివాడల్లో ఇంటింటికి పిచికారీ చేయాలని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే మలేరియా జ్వరాలకు సరిపడా మందులు అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. దోమతెరలు పంపిణీ చేసి వాటి వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో డెగీ జ్వరాలకు చికిత్స కోసం అందించేందుకు చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నాయకులు కోరారు..

## మరీ ఇంత నిర్లక్ష్యమా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



శిథిలావస్థలో ఉన్న చెక్ పోస్టు ఇదే..

ఈ చిత్రాన్ని చూస్తే నిర్లక్ష్యం నిండుగా కనిపిస్తుందని చెప్పక మానదు. ఏడాదికి లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్న కురుపాం మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న గుమ్మలక్ష్మీపురం మొబైల్ చెక్‌పోస్టు దుస్థితి ఇది. గత రెండేళ్లుగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్న చెక్‌పోస్టు కార్యాలయం శిథిలావస్థకు చేరింది. గోడలు పూర్తిగా బీటలు వారాయి. కేవలం దన్నుగా ఉన్న పైకప్పు భాగం ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో సిబ్బంది భయపడుతున్నారు. ఏడాదికి రూ.50 లక్షలకు పైగా ఆదాయం వస్తున్న మొబైల్ చెక్‌పోస్టుపై సంబంధిత అధికారులకు నిర్లక్ష్యం తగదని స్పందించి దాని స్థానంలో సిబ్బంది విధులకు వీలుగా కొత్తది నిర్మించాలని స్థానిక ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

## నేరాలు ఘోరాలు


## మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొమరాడ మండలం కంభవలసకు చెందిన కొండగొర్రె లత అనే వివాహిత శనివారం సెల్‌ఫోన్ విషయమై మరిదితో గొడవపడ్డారు. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న గడ్డి ముందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రిక తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్


కామేష్

సాలూరు మండలం జగ్గుదొరవలసకు చెందిన నిమ్మక కామేష్ శనివారం తన భార్యతో గొడవ పడ్డాడు. తీవ్రంగా దూషించిందన్న మనస్థాపంతో ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్పందించిన కుటుంబీకులు జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

# ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

## డాక్టర్స్ డే ప్రత్యేక అనుబంధం




విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా | శనివారం 1-7-2023 | 20 పేజీలు



# వైద్య పితామహుడు.. బిసి రాయ్



సమాజంలో ఉన్న వృత్తులూ దేనికదే ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. వైద్య వృత్తి మాత్రం మిగతా వాటికి భిన్నంగా పవిత్రమైనదిగా చెప్పవచ్చు. ఎందుకంటే మరణపు చివరిటంచులదాకా వెళ్లిన వారి ప్రాణం నిలిపే శక్తి వైద్యునికే ఉంది. ఈ ప్రాణదాతల కోసం కేటాయించినదే 'డాక్టర్స్ డే'. మన సంప్రదాయాలు, సంస్కృతుల్లో భాగంగా పండగలు ఎలా నిర్వహించుకుంటున్నామో అలాగే ప్రత్యేక దినోత్సవాలను జరుపుకోవాల్సిన అవసరం ఉంది. వీటిద్వారా గత స్మృతులను గుర్తు చేసుకుని దినోత్సవాల ప్రాధాన్యతను భావితరాలకు స్ఫూర్తిగా అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. మానవసేవే పరమావధిగా సాగే వైద్యవృత్తిలో ఎంతగా సేవానిరతి కలిగి ఉంటే అంతటి గొప్ప వైద్యునిగా గుర్తింపు లభిస్తుంది. అలాంటి వారు చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచి కీర్తి పొందుతారు. అలాంటి వ్యక్తే డాక్టర్ బిదన్ చంద్రరాయ్ (బిసిరాయ్). మన దేశంలో వైద్య రంగానికి ఎనలేని సేవలందించారు. వైద్య రంగానికే వన్నె తెచ్చారు. ఆయన జన్మదినం, మరణించిన రోజు ఒకే తేదీ కావడం గమనార్హం. అదే జులై ఒకటి.. ఆయన సేవలకు గుర్తుగా ఆ రోజున డాక్టర్స్‌డే నిర్వహించుకుంటున్నాం.

2లో

# వైద్య పితామహుడు.. బిసి రాయ్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతి ఏటా జులై ఒకటో తేదీన డాక్టర్స్ డే నిర్వహించుకుంటున్నాం. రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చేసే నిరంతర సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది. అనుక్షణం ఆరోగ్యాన్ని. శారీరక, మానసిక స్థైర్యాన్ని అందించే డాక్టర్‌కు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం. ఆ ప్రాణదాతలు పోసే ఊపిరితో గుండెల నిండుగా కృతజ్ఞతలు నింపుకుని పదేపదే గుర్తుచేస్తూ ఉండేందుకు వారికోసం ప్రపంచమంతా ఒక రోజు కేటాయించింది. అదే ప్రపంచ డాక్టర్స్‌డే.

### డాక్టర్స్‌డే చరిత్ర

జార్జియాలోని విండార్లో డాక్టర్ చార్లెస్ బి.తల్మండ్ గొప్ప వైద్యుడు. ఆయన రోగుల కోసం చేస్తున్న సేవను చూసి ఆయన భార్య బ్రౌన్‌తల్మండ్ ఆశ్చర్య పోయింది. డాక్టర్లు రోగుల కోసం తమ వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి నిరంతరం వారు పడుతున్న తపన, చేస్తున్న సేవలకు గుర్తుగా వారి గౌరవార్థం సంవత్సరంలో ఒక రోజును కేటాయించింది. వారి సేవలను మననం చేసుకుంటూ కృతజ్ఞతగా శుభాకాంక్షలు చెప్పాలని భావించింది. విండార్లో 1933 మార్చి 30న తొలి డాక్టర్స్ డేను పాటించారు. ఆరోజున గ్రీటింగ్ కార్డులు పంపడం, అసువులు బాసిన డాక్టర్లకు పూలతో నివాళులర్పించటం ద్వారా తొలి డాక్టర్స్ డే నిర్వహించారు. యుఎస్‌లో 1958 మార్చి 30న డాక్టర్స్‌డే పాటిస్తూ ప్రతినిధుల సభ తీర్మానించింది.

మార్చి 30వ తేదీని నేషనల్ డాక్టర్స్‌డేగా పాటించాల్సిందిగా 1990 అక్టోబర్ 30న జార్జిబుష్ చట్టం చేశారు. మన దేశంలో భారత దేశంలో ప్రతి ఏటా జులై 1న నేషనల్ డాక్టర్స్‌డే పాటిస్తున్నాం. ప్రముఖ డాక్టర్ బిదన్‌చంద్ర రాయ్ గౌరవార్థం ఈ రోజును నిర్ణయించారు. ఈయన 1882 జులై 1న బీహార్‌లోని పాట్నా జిల్లాలో ఉన్న బకింపూర్‌లో జన్మించారు. తండ్రి పేరు ప్రకాష్ చంద్ర. బిసి రాయ్ 14వ ఏటే తన తల్లిని కోల్పోయారు.

అవివాహితుడైన డాక్టర్ బిసి రాయ్ తన ఆస్తులతో పాట్నాలో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవలకు దానిని అంకితం చేశారు. 1909-11 మధ్య ఇంగ్లాండ్‌లో వైద్యవిద్య పూర్తిచేసుకుని 1911లో భారతదేశానికి వచ్చి కలకత్తాలోని మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. జాదవ్‌పూర్ టిబి హాస్పటల్. ఆర్‌జి. బార్ వెడికల్ కాలేజ్ , కమలా నెహ్రూ హాస్పటల్, విక్టోరియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్, చిత్తరంజన్ క్యాన్సర్ హాస్పటల్ మొదలగు వైద్య, ఆరోగ్య సంబంధిత సంస్థలను నెలకొల్పి వాటిద్వారా అపారమైన సేవలందించారు. 1926లో ప్రత్యేకంగా మహిళలు, పిల్లల కోసం చిత్తరంజన్ సేవాసదన్ పేరుతో వైద్యశాలను ఏర్పాటుచేసి మహిళల కోసం నర్సింగ్ శిక్షణా సంస్థను ఏర్పాటు చేశారు.

### రాజకీయ రంగంలో డాక్టర్ బిసి రాయ్

1925లో రాజకీయ రంగప్రవేశం చేశారు. బారక్‌పూర్ అసెంబ్లీ నుంచి పోటీచేసి ప్రముఖుడైన "గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ బెంగాల్‌గా" పేరొందిన సురేంద్రనాథ్ బెనర్జీపై గెలుపొందారు. 1922-28 మధ్య కలకత్తా మెడికల్ జర్నల్‌కు సంపాదక బాధ్యతలు నిర్వర్తించారు. 1928లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా, కలకత్తా మేయర్‌గా, 1942లో కోల్‌కత్తా విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గానూ 1943లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ప్రెసిడెంట్‌గానూ ఎన్నికయ్యారు. విద్యావైద్య రంగాల్లో ఆయన సేవలకు గౌరవార్థం 1944లో డాక్టరేట్ పొందారు.

1948 జనవరి13వ తేదీన పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్య మంత్రిగా పదవి చేపట్టారు. 1961 ఫిబ్రవరి 4న ఆయనకు భారతరత్న వరించింది. భారత ప్రభుత్వం 1962లో జులై1వ తేదీన ఆయన గౌరవార్థం డాక్టర్స్‌డేగా నిర్వహించాలని ప్రకటించింది. 1976నుంచి వివిధ రంగాలలో సేవలందించిన వారికి డాక్టర్ బిసి రాయ్ పేరుమీద అవార్డులను ప్రదానం చేస్తున్నారు. నేటి వైద్యులకు, వైద్య విద్యార్థులకు డాక్టర్ బిసి.రాయ్ ఆదర్శ ప్రాయులు. ఆ మహానుభావుని ఆదర్శాలను నేటి వైద్యులు ఆచరించాలని కోరుకుంటున్నాం.

# వైద్యులే ప్రాణదాతలు



***ఔను! వైద్యులు ప్రాణదాతలే. సంపాదించిన జ్ఞానంతో సాటి మనిషిని కాపాడగలిగే శక్తి సామర్థ్యాలు కేవలం వైద్యులకు మాత్రమే ఉంటాయి. అందుకే కనిపించని దేవుళ్ల కన్నా గొప్పవారుగా కీర్తించబడతారు. గడిచిన రెండేళ్లలో కరోనా కష్టకాలంలోనైనా, నేటి సీజనల్ వ్యాధులు, రోడ్డు ప్రమాదాలు నుంచి ఆరోగ్యాన్ని, ప్రాణాల్ని రక్షించగలుగుతున్నారు. ఈ విషయంలో రాత్రి, పగలు అనే తేడా లేదు. పేద, ధనిక అన్న తారతమ్యం అంతకన్నా కనిపించదు. ఎంత పనిఒత్తిడిలో వున్నా రోగిన రక్షించడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యంగా భావిస్తారు. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులతో గడిపే అవకాశాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోగాలతో మూలుగుతున్నా.. మృత్యువుతో పోరాడుతున్నా.. వారిని అమ్మలా... నాన్నలా.... తోబుట్టువులా... అక్కున చేర్చుకుని సేవలందిస్తారు. అందుకే వృత్తుల్లో దేనికదే ప్రాధాన్యత ఉన్నప్పటికీ వైద్యవృత్తికి ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే మనిషి ప్రాణాలను కాపాడే అవకాశం, అందుకు తగ్గ శక్తిసామర్థ్యాలు వారికి మాత్రమే ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో జులై 1న ప్రపంచ వైద్యుల దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో వైద్యసేవలు, వైద్యరంగంలో వచ్చిన మార్పులను గుర్తుచేసేదే ఈ ప్రత్యేక కథనం.***

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశ్వవ్యాప్తంగా కరాళనృత్యం చేస్తున్న కరోనా వైరస్ బారిన మన జిల్లాలోనూ లక్ష మందికిపైగా పడిన విషయం విధితమే. వీరందరికీ వైద్య సేవలందించడంలో వైద్యుల పాత్ర అత్యంత కీలకం. కరోనా వైరస్ ఒక అంటువ్యాధి అని తెలిసినా ప్రాణాలకు తెగించి సేవలందించిన త్యాగమూర్తులు కొందరు అశువులు బాసిన తీరు జిల్లా వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. నేటి పరిస్థితుల్లో వైద్య వృత్తి కత్తిమీద సాములా మారింది. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రుల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా వైద్యులు లేరు. ఉన్న కొద్ది మంది వైద్యులే అన్ని రకాల సేవలూ అందించాల్సివస్తోంది. వైద్యులు నిరంతర విద్యార్థులు వంటివారు. వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. కొత్తకొత్త ఆవిష్కరణలను ఆకలింపజేసుకుంటూనే రోగులకు అందుకనుగుమైన వైద్యసేవలను అత్యంత ఓర్పు, సహనంతో అందిస్తుంటారు. అధ్యయనం తగ్గితే రోగులకు న్యాయం చేయలేని పరిస్థితి. ఇందుకోసం ఎంతో మంది వైద్యులు నిరంతరం హోం వర్కు, టీం వర్కు వంటి పద్ధతిని అవలంభిస్తుంటారు. ఇలాంటి పని ఒత్తిడిలో రోగులు లేదా వారి బంధువులతో మాట్లాడినప్పుడు చిరాకుపడినా, పరాకు వహించినా కొంతమంది దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడడం నేరమే కాదు. తల్లిదండ్రులను, దైవాన్ని అవమానించినట్టే లెక్క. ఎందుకంటే వైద్య వృత్తి అంత పవిత్రమైనది. రోగులనుంచి తమ ఆరోగ్యానికి హాని ఉంటుందని తెలిసినా వారిని చేరదీసి వైద్యారోగ్య సేవలు అందించేందుకు ఏమాత్రం వెనుకాడనిది వైద్యులు మాత్రమే. సాటి రక్త సంబంధీకులే పట్టించుకోని ఈ రోజుల్లో రోగులను వెన్నుతట్టి ఆరోగ్యం కుదుట పడుతుందంటూ కుశల ప్రశ్నలతో ధైర్యం చెప్పే వైద్యులను ఎంత గౌరవించినా తక్కువే. ఇలా ప్రభుత్వ వైద్యులు నిత్యం పనిభారంతో నలిగిపోతుంటే అటు ప్రైవేటు వైద్యులూ ఆప్తులుగా మారుతున్నారు. ప్రభుత్వ విధానాల వల్ల సంబంధిత ఆసుపత్రుల్లో తగిన ముందులు, లేదా వైద్యపరికరాలు, లేబొరేటరీలు వంటివి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రైవేటు నర్సింగ్ హోంలను ఆశ్రయించక తప్పడం లేదు. ఫీజుల, బిల్లుల సంగతి కాస్త పక్కనబెడితే రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అందుబాటులో ఉండడం గొప్ప విషయమే. రోగి ఎలాంటి స్థితిలో వచ్చినా వారు వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగానే ఉంటారు. అందుకే వైద్యులను ప్రాణదాతలు అంటారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

## బొబ్బిలి సిహెచ్‌సి వైద్యాధికారి శశిభూషణరావు



ప్రజాశక్తి-బొబ్బిలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి సిహెచ్‌సి వైద్యాధికారి గేదెల శశిభూషణరావు సూచించారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. రోడ్లు, కాలువలు, నివాస పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ ఉంచకూడదు. వాటర్ ట్యాంకులను వారానికి ఒకసారి శుభ్రం చేసి డ్రైడే పాటించాలి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలి. రోడ్డుపై విక్రయిస్తున్న తినుబండారాలు తీసుకోకూడదు. జ్వరాలు వస్తే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుత వాతావరణంలో మలేరియా, డయేరియా, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తింటే డయేరియా వచ్చే అవకాశముంది.

# 'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన సేవలు

## జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలంతా వినియోగించుకొని వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే..




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం. జిల్లాలోని 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో 482 వైఎస్ఆర్ విలేజి క్లినిక్‌లు ఉన్నాయి. ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు డాక్టర్లు వారి పరిధిలో ఉన్న విల్లేజ్ క్లినిక్ లను రెండు భాగాలుగా విభజించుకొని వాటిని నెలలో రెండు సార్లు తప్పనిసరిగా సందర్శించి వైద్య సేవలు అందించాలి. ఇద్దరు డాక్టర్లూ కో ఆర్డినేషన్ చేసుకొని ఒకరు తప్పనిసరిగా పిహెచ్‌సిలో ఉండే విధంగా చూసుకోవాలి. డాక్టర్ విలేజ్ క్లినిక్‌కు వెళ్లినప్పుడు ఉదయం 9గంటల నుంచి ఒంటి గంట వరకు ఓపి చూడాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు మంచం మీద నుంచి లేవలేని వారికి, ఇటీవల కాలంలో ఆపరేషన్ చేసుకొని వచ్చిన వారి వద్దకు వెళ్లి వైద్య సేవలందించాలి. అంగన్వాడీ సెంటర్‌లను కూడా సందర్శించి సేవలు అందించాలి. సీజనల్ వ్యాధుల పట్ల కూడా అనుబంధ శాఖలు అనుసంధానం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ విలేజ్ క్లినిక్‌లో 106 రకాల మందులు, 18 రకాల పరీక్షలకు అవసరమైనవి అందుబాటులో ఉంటాయి. ఇందులో నిష్ణాతులైన ఒక ఉద్యోగి కూడా నిత్యం అందుబాటులో ఉంటారు. వీటితో పాటు ప్రతి పిహెచ్‌సి పరిధిలో 172 రకాల మందులు. 72 రకాల పరీక్షలు చేసుకోవడానికి అవసరమైనవి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. డాక్టర్లు, నర్సుల కొరత లేదు. అందువల్ల ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాల్సి ఉంది.

రానున్న కాలంలో వర్షాలను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఫ్రైడే డ్రైడే గా చేసుకొని శానిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇతర శాఖల అధికారులను అనుసంధానం చేసుకొని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే చేయించాం. జిల్లాలో 16 హైరిస్క్ గ్రామాల్లో కూడా సర్వే చేసి తగు చర్యలు తీసుకుంటున్నాం. మాతా శిశు సంరక్షణ పథకం కింద కూడా సర్వే చేసి పిల్లలకు అవసరమైన మందులు పంపిణీ చేస్తాం. జన్యు పర మైన లోపాలతో పుట్టిన పిల్లలకు టిఫా స్కాన్ చేయించి వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఇప్పటికే గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్‌లతో టైఅప్ చేసుకొని ఆ పిల్లలకు అన్ని రకాలు సేవలు అందిస్తున్నాం.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం

## సదాశివ ఆస్పత్రి వైద్యులు పెంట రాకేష్

ప్రజాశక్తి-బొబ్బిలి



పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని సదాశివ ఆసుపత్రి వైద్యులు పెంట రాకేష్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే దోమలను నివారించవచ్చు. పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి. దోమలను నివారిస్తే వ్యాధులను నివారించవచ్చు. నీరు వేడి చేసి చల్లార్చి తాగితే ఆరోగ్యంగా ఉండగలం. నీరు ఎంత ఎక్కువ తాగితే ఆరోగ్యానికి అంతమంచిది. మూత్ర, మల విసర్జన చేసిన తర్వాత చేతులను సబ్బుతో కడగాలి. సీజనల్ వ్యాధులు వస్తే పారాసిటమాల్ మాత్రలు వేయాలి. అప్పటికీ తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి.



## ప్రయివేటు ఆస్పత్రులకు

# స్థాయిని బట్టి నిబంధనలు ఉండాలి

## ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసి నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం



ప్రైవేటు ఆస్పత్రులకు వాటి స్థాయిని బట్టి ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు అన్నారు. మరోవైపు రోగులు, వైద్యుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఉండాలని తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే...

ప్రస్తుత సమాజంలో ప్రవేట్ ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, అయితే చిన్ని చిన్న క్లినిక్‌లకు, నర్సింగ్‌హోమ్‌లకు, కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రభుత్వ నిబంధనలు ఒకేలా ఉండడంతో చిన్న చిన్న ఆస్పత్రులు నడిపేవారు ఇబ్బందులు పడుతున్నారు. హాస్పిటల్ స్థాయిని బట్టి ప్రభుత్వ నిబంధనలు ఉంటే రోగికి నాణ్యమైన వైద్యం అందుతుంది. అందువల్ల ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసు కోవాలని కోరుతున్నాం. ఫైర్ పొల్యూషన్ తదితర నిబంధనల వల్ల చిన్న చిన్న ఆస్పత్రులు నడుపుతున్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ఖర్చులు పెరుగుతుండటంతో రోగులకు మంచి వైద్యం అందించలేకపోతున్నారు. అక్కడక్కడ కొంతమంది డాక్టర్లు చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లు వల్ల మొత్తం డాక్టర్స్‌పై సమాజంలో అప నమ్మకం ఏర్పడుతోంది. భవిష్యత్తులో అటువంటి అభిప్రాయం లేకుండా ఇటు డాక్టర్లు, అటు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. వైద్యులు, రోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు ఐఎంఎ తరుపున కృషి చేస్తున్నాం.

రానున్న కాలంలో ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలతో పాటు కొన్ని ప్రతిపాదనలు కూడా చేస్తాం. ఐఎంఎ నుంచి ఒకరిని ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని, శాసనమండలిలో డాక్టర్స్ వ్యవస్థ నుంచి ఒక ఎమ్మెల్సీ పదవికి అవకాశం ఇవ్వాలని కోరుతాం. తమలో ఒకరు ప్రభుత్వ సలహాదారులు ఉంటే వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టడానికి అవకాశం ఉంటుంది. ఏదేమైనా రోగులకు, వైద్యులకు మధ్య దూరం పెరిగితే ప్రమాదం. అందువల్ల వీరి మధ్య సత్సంబంధాలు పెంచేందుకు రానున్న కాలంలో పలు అవగాహనా కార్యక్రమాలు చేపడతాం. ఇందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాం.

# కిడ్నీలో రాళ్ల పట్ల అప్రమత్తం

## జనరల్ సర్జన్ డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్

**ప్రజాశక్తి-శృంగవరపుకోట**



కిడ్నీలో రాళ్లు ఏర్పడితే అశ్రద్ధ వహించకూడదని జనరల్ సర్జన్ డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు వివరాలు ఆయన మాటల్లోనే..

కిడ్నీలో రాళ్లు ఏర్పడితే కడుపునొప్పితోపాటు వెన్నెముకకు ఇరువైపులా నొప్పి మొదలవుతుంది. పొట్టలోకి రేడియేట్ అవుతూ అక్కడ నుంచి కింద పొత్తికడుపు వరకు నొప్పితో మొదలై వాంతులు, వికారంతోపాటు మూత్రం రంగు మారడం, ఎక్కువ లేదా తక్కువ కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువ శాతం కిడ్నీలో రాళ్లు ఉండటం వల్ల మూత్రంలో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలున్నాయి. సాధారణంగా ఇది పదేళ్ల నుంచి 60ఏళ్ల మధ్యలో ఎప్పుడైనా రావచ్చు. మూత్రం ఇన్ఫెక్షన్ సర్వసాధారణంగా ఆడవారిలో ఎక్కువగా ఉంటుంది. కిడ్నీలో రాళ్లు అనే ఎక్కువగా మగవారిలో కనిపిస్తుంటాయి. తరచూ యూరిన్ ఇన్ఫెక్షన్స్, మూత్ర ద్వారంలో ఇన్ఫెక్షన్స్‌తో, మూత్ర ద్వారం ఆపరేషన్ చేయించుకున్న వాళ్లలో, క్యాబేజి, కాలీఫ్లవర్, టమాటా, పాలకూర, నల్ల ద్రాక్ష, మాంసాహారం ఎక్కువగా తినే వాళ్లలో, నీటిని తక్కువగా తీసుకునే వాళ్లలో కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అక్కడినుండి కిందకు జారి మూత్రనాళం ద్వారా (యురేటర్) మూత్రాశయానికి వస్తాయి. మూత్రద్వారం నుండి బయటికి పోతాయి. ఇందులో మూడు లేక నాలుగు రకాల స్టోన్స్ ఉంటాయి. ఈ రాళ్లు సైజును బట్టి అవి ప్రమాదకరమైన కావచ్చు. లేదా ప్రమాదకరం కాకపోవచ్చు. సాధారణంగా ఒక సెంటీమీటర్ కన్నా ఎక్కువ ఉన్న రాళ్లను లాప్రోస్కోప్ ద్వారా, యురోస్కోప్ (ఎండోస్కోప్) తొలగించవచ్చు. పెద్దసైజు స్టోన్స్ ఉన్నప్పుడు బ్లాస్టింగ్ విధానం ద్వారా తొలగించవచ్చు. సాధారణంగా దీనికి టెస్టులు అవసరం ఉండకపోవచ్చు. కిడ్నీలో రాళ్లు ఏర్పడడాన్ని అశ్రద్ధగా తీసుకుంటే రెండు కిడ్నీలు పాడైపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ప్రతిఒక్కరూ కిడ్నీలో రాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

# గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

## ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణులు సునీత

**ప్రజాశక్తి-బొబ్బిలి**



గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్నే తీసుకోవాలని, ఎలాంటి బయట తిండ్లు తినకూడదని ప్రసూతి, సంతాన సాఫల్య వైద్యనిపుణులు వి.సునీత అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడుతూ గర్భిణులకు పలు సూచనలు చేశారు. వివరాలు ఆమె మాటల్లోనే...

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పాలు, పండ్లు, గుడ్లు, మాంసం వంటి పౌష్టికాహారం తీసుకోవాలి. మొదటి మూడు నెలలు ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలి. ఈ మాత్రలు వల్ల పుట్టబోయే బిడ్డలో వెన్నెముక లోపాలను నివారించవచ్చు. గర్భిణులు హైబిపి, డయాబెటిస్ వంటి సమస్యలకు వైద్యుల సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షించుకోవాలి. బరువైన వస్తువులు మోయడం చేయకూడదు. దూరప్రయాణాలు చేయకపోవడమే మంచిది. పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు తాగిస్తే ఆరోగ్యంగా ఉంటారు. వైద్యులను సంప్రదించిన ప్రతిసారీ గర్భాదారణ సమయంలో బరువు, బిపి, శరీరం నుంచి కోల్పోయే ప్రోటీన్లను తెలుసుకునేందుకు మూత్ర పరీక్షలు చేయించుకోవాలి. బిడ్డ ఎదుగుదల, పరిశీలనకు స్కానింగ్ చేయించాలి. నిద్రపోయేటప్పుడు ఎడమ వైపు తిరిగి పడుకోవడం మంచిది. నొప్పులు వచ్చినా, ఉమ్మినీరు పోయినా, రక్తస్రావం జరిగినా బిడ్డ కదలికలు లేకపోయినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తొలి మూడు నెలలు పూర్తయ్యేంత వరకు శృంగారానికి దూరంగా ఉండడం మంచిది. ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.



# రోగులు - వైద్యుల సంబంధాలు మెరుగుపడాలి

- వైద్యులపై దాడుల నివారణకు చట్టం అవసరం
- ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ వియస్ ప్రసాద్



**ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి**

రోగుల ఆరోగ్యం కాపాడటమే వైద్యుల ప్రధాన ధ్యేయమని ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. వైద్యులు భగవంతులు కారని, వైద్య సేవ అందించే మానవులు మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ వైద్యుడైనా రోగి జబ్బుకు మందు ఇవ్వగలరు కానీ ఆయుష్షు పోయలేరని తెగేసిచెప్పారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

చికిత్స సమయంలో రోగి శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలు సహకరించాలని, లేకపోతే రోగం నయం కాకపోవడమే కాక మరణాలు సంభవించవచ్చు. దీంతో అప్పటి వరకు తమ వారి ప్రాణాలు కాపాడాలని ప్రాథేయపడి వైద్యులను దేవుళ్లని పొగిడిన రోగుల బంధువులే వారిపై నిందలు మోపి దాడులకు పాల్పడడం శోచనీయం. ఇలాంటి దాడులు చేసే అవకాశముంటే ఏ వైద్యుడు కూడా సీరియస్ కేసుకు చికిత్స ఇవ్వడానికి ముందుకు రాలేడు. స్వేచ్ఛా వాతా వరణంలో, ఒత్తిడి లేనప్పుడు మాత్రమే ఎటువంటి సీరియస్ కేసునైనా వైద్యులు తీసుకోగలరు. రోగుల బంధువులు ఇటువంటి దాడులను నివారించక పోతే భవిష్యత్తులో సమాజానికే పెను ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు వినియోగదారుల రక్షణ చట్టం.. జీవితంలో సంపాదించలేని మొత్తాన్ని శిక్షల కింద కోర్టులు విధిస్తుంటే వైద్యులు ఎలా సీరియస్ కేసులకు చికిత్స అందించగలరు? అందుకే వైద్య సేవలను ఆ చట్టం పరిధి నుండి తప్పించి, శిక్షలకు పరిమితి విధించాలన్నది ఐఎంఎ డిమాండ్. ఏదన్నా ఆసుపత్రిలో అనుకోని పరిస్థితుల్లో రోగి మరణిస్తే కొన్ని అసాంఘిక శక్తులకు వైద్యులపై భౌతిక దాడులకు దిగడం లేదా బేరసారాలు చేయడం అలవాటైంది. ఆసుపత్రి ఆస్తులను ధ్వంసం చేసినా, సిబ్బందిపై గాని, వైద్యులపై గాని దాడులు చేసి గాయపరిచినా 2008లో విడుదల చేసిన యాక్ట్ 11 ప్రకారం వారికి మూడేళ్ల జైలు, రూ.50 వేలు జరిమానా విధించే అవకాశముంది. ఈ నేరాన్ని కాగ్నిజబుల్, నాన్ బెయిలబుల్ నేరంగా గుర్తించారు. అసాంఘిక శక్తులను కట్టడి చేయాలంటే ఈ చట్టాన్ని పోలీస్ మాన్యువల్‌లో పొందుపరచుటే కాక విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. అనుకోని పరిస్థితుల్లో రోగి మరణిస్తే వైద్య సేవలో నిర్లక్ష్యం ఉందని అనుమానముంటే జిల్లా వైద్య అధికారులకు, చట్టానికి ఫిర్యాదు చేయాలి. దాడులను నివారించకపోతే ఆధునిక వైద్య రంగం నిర్వీర్యం అవుతుంది. సమాజం నష్టపోతుంది. ఏ తల్లిదండ్రులూ అల్లారుముద్దుగా పెంచుకున్న తమ పిల్లలను వైద్యరంగంలో చేర్పించరు. యువత ఈ దాడులు చూసి విసిగిపోయి వైద్యేతర రంగాలను కోరుకుంటున్నారు. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆధునిక వైద్యరంగానికి తూట్లు పొడుస్తోంది. అల్లోపతీ, ఆయుర్వేదం కలిపి కిచిడి వైద్యం పేరిట ప్రజలకు నాణ్యత లేని వైద్యాన్ని అందించబోతుంది. ఈ రంగంలో చేరడానికి ఎవరు ముందుకొస్తారు? ఆధునిక వైద్యం.. అల్లోపతీ నిర్వీర్యం కాకుండా చూడాలంటే ఇటు వైద్యులపై దాడులు ఆపి నిర్భయ వాతావరణాన్ని కల్పించాలి. అటు ప్రభుత్వం అశాస్త్రీయమైన మిక్సోపతి కిచిడి వైద్యం ఆలోచనలు ఆపాలి. వైద్యులు, ఆస్పత్రులు వైద్యసేవలు అందిస్తున్నప్పుడు సురక్షిత వాతావరణం కల్పించుటకు అనువైన పరిస్థితులు, చట్టాలు కల్పించాలి. వైద్యసేవ అందిస్తున్నప్పుడు వైద్యులు ఎన్నో ఒత్తిళ్లకు గురౌతున్నారు. గుండె ఆపరేషన్ చేస్తున్న వైద్యులే గుండెపోటుకు గురౌతున్నారు అంటే సమస్య ఎంత తీవ్రత అన్నది అర్థం చేసుకోవచ్చు. దానికి తోడు రోగి బంధువుల దాడులు, అసాంఘిక వ్యక్తుల బేరసారాలు, వారి బెదిరింపులు, మరోవైపు వినియోగదారుల రక్షణ చట్టం తీర్పులు.. వైద్యులను మరింత ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఒత్తిడి లేని వాతావరణంలో మరింత సంతృప్తి కరంగా సేవలందించగలరన్న అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉంది.

# అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యసేవలు

## తిరుమల - మెడికవర్ ఎమ్‌డి తిరుమల ప్రసాద్, సెంటర్ ఇన్‌ఛార్జి పద్మకుమార్


తిరుమల ప్రసాద్


పద్మకుమార్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తిరుమల - మెడికవర్ ఆసుపత్రిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యసేవలు అందజేస్తున్నామని తిరుమల - మెడికవర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల ప్రసాద్, ఆ సంస్థ విజయనగరం సెంటర్ ఇన్‌ఛార్జి పద్మకుమార్ తెలిపారు. ఎంఆర్‌ఐ సహా అనేక వైద్యారోగ్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వైద్యారోగ్య రంగంలో మెడికవర్ కొత్తకొత్త ఆవిష్కరణలను సృష్టిస్తోందని అన్నారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకుని 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఆసుపత్రిలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ సర్జరీ, లేప్రోస్కోపిక్, గైనకాలజీ, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ, పల్మనాలజీ, ఇఎన్‌టి, రేడియాలజీ, రుమటాలజీ, కీళ్లు, ఎముకలు జాయింట్ రీప్లేస్‌మెంట్, ఇంటర్నల్ మెడిసిన్ వంటి ఎన్నో సదుపాయాలు స్థానికంగా ఉన్నాయి. ఇందుకనుగుణంగానే మౌలిక వసతులను సమకూర్చాం. అత్యుత్తమ వైద్య నిపుణులు, రోగనిర్ధారణ చేసే డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఇటీవలే ఎంఆర్‌ఐ స్కాన్ కూడా అందుబాటులోకి వచ్చింది. అత్యాధునిక పద్ధతిలో ఔట్, ఇన్ పేషెంట్లకు సేవలు అందుతున్నాయి. ఆసుపత్రిలో 250 జనరల్ బెడ్స్, 35 ఐసియు బెడ్స్, 32 స్లైస్ సీటీ స్కాన్ బెడ్స్, స్టేట్ ఆఫ్ ద హార్ట్ ఫ్లాట్ పేనల్ కేథల్యాబ్, కార్డియాక్ అండ్ పెరిఫెరల్ యాంజియో గ్రామ్ అండ్ యాంజియో ప్లాస్టీ, ఫైవర్ వరల్డ్ క్లాస్ ఆపరేషన్ థియేటర్స్, సిఆర్ఆర్‌టి సి-ఆర్మ్‌స్, ఎండో స్కోపీ అండ్ ఇఆర్‌సిపి యూనిట్, త్రీ ఎకో మిషన్స్, బ్రోంకో స్కోపీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ హెచ్‌డి ల్యాప్రోస్కోపీ అండ్ హిస్టిరో స్కోపీ యూనిట్, అంబులెన్స్, మొబైల్ ఐసియు, ఆర్‌ఐఆర్‌ఎస్ వంటి మౌలిక సవతులు ఉన్నాయి' అని వివరించారు.

పద్మకుమార్ మాట్లాడుతూ... 'ఏటా విస్తరిస్తున్న మెడికవర్ ఇప్పటి వరకు 12దేశాల్లో సేవలందిస్తోంది. అన్ని ప్రాంతాల్లో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తేవాలన్నదే తమ సంస్థ లక్ష్యం. ముఖ్యంగా యూరప్‌లోని మన దేశంతోపాటు జర్మనీ, హంగేరి, హాలెండ్, టర్కీ, జార్జియా, రొమానియా, పెర్బియా, ఉక్రెయిన్ దేశాల్లో తమ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆయా దేశాల్లో 26ఆసుపత్రులు, 125మెడికల్ సెంటర్లు, 16 సంతాన సాఫల్య కేంద్రాలు, 95మెడికల్ లేబొరేటరీలు, 4వేలకు పైగా బెడ్స్ ఉన్నాయి. అన్ని చోట్లా అత్యాధునిక శిక్షణ పొందిన 35వేల ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. వీరంతా కలిసి ఏటా కోట్లాది మంది రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నారు.క్యాన్సర్ ఇనిస్టిట్యూట్స్, సంతాన సాఫల్య ఆసుపత్రులు, మల్టీస్పెషాలిటీ, చిన్నపిల్లల ఆసుపత్రులు ప్రత్యేకంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

**అందుబాటులో హెల్త్ చెకప్ ప్యాకేజీలు**

'ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్యాన్ని పరీక్షించుకుని అప్రమత్తంగా మెలిగేందుకు తమ సంస్థ ఎన్నో హెల్త్‌కేర్ చెకప్ ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిలో టోటల్ బాడీ చెకప్, ఎక్స్‌క్లూజివ్ హెల్త్ చెకప్, మాస్టర్స్ హెల్త్‌చెకప్, హార్ట్ హెల్త్ చెకప్, కంప్లీట్ గ్యాస్ట్రో ప్యాకేజీ, బేసిక్ హెల్త్ చెకప్ ప్యాకేజీ, వెల్ ఉమెన్ చెకప్ వంటి ప్యాకేజీలు ఉన్నాయి. వీటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ సంస్థల కార్డులపైనా సేవలందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ, ఇహెచ్‌ఎస్, ఇఎస్‌ఐ తదితరాలపై రోజూ సేవలు అందిస్తున్నాం' అని పద్మకుమార్ వివరించారు.

# వ్యాయామంతో గుండె భద్రం

## గుండె వైద్య నిపుణులు సునీల్ కుమార్



ప్రజాశక్తి-బొబ్బిలి

వ్యాయామంతో గుండెను భద్రంగా ఉంచుకోవచ్చునని నారాయణి హృదయాలయ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు పెంట సునీల్ కుమార్ అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే గుండెను భద్రంగా ఉంచుకోవచ్చు. వాకింగ్, యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. స్మోకింగ్, గుట్కా, ఖైనీ, పాన్ మసాలా వంటి వాటికి దూరంగా ఉండాలి. అధికంగా మద్యం సేవిస్తే ప్రమాదం. కొలెస్ట్రాల్ (కొవ్వు) అధికమైతే గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కొలెస్ట్రాల్ పెంచే ఆహారానికి దూరంగా ఉండాలి. మధుమేహం నియంత్రణలో ఉంచుకోవాలి. అధిక బరువు ఉంటే తగ్గించుకోవాలి. వంశపారంపర్యం వల్ల గుండె పోటు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ డి3 లోపం ఉంటే తొందరగా మధుమేహం, గుండె వ్యాధులు వస్తాయి. విటమిన్ డి3 లోపాన్ని అధిగమించేందుకు ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి 9.30 మధ్యలో శరీరానికి ఎండ తగిలే విధంగా దుస్తులు ధరించి ఎండలో వ్యాయామం చేయాలి. ఐరన్ లోపం వల్ల ఆయాసం వచ్చి గుండెపై అధిక భారం పడటం వల్ల గుండె వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. థైరాయిడ్, విటమిన్ డి3, కొలెస్ట్రాల్ ఒకదానితో ఒకటి సంబంధం ఉండటం వల్ల ఒకటి మారితే మరో లోపం వచ్చే అవకాశముంది. కిడ్నీ వ్యాధి ఉన్న రోగులకు అధిక రక్తపోటు, ఆయాసం వస్తుంది. వీరు రెగ్యులర్‌గా డయాలసిస్ చేసుకోవడం వల్ల గుండె వ్యాధులను నివారించవచ్చు. పోస్ట్ కోవిడ్ వారు ఇన్‌ఫ్లామేషన్ అధికంగా ఉండడం వల్ల రక్తనాళాల్లో వాపు రావడం, కొలెస్ట్రాల్ పేరుకుపోవడంతో రక్తనాళాలు మూసుకుపోయి పక్షవాతం, గుండె జబ్బులు రావడానికి అవకాశం ఉంది.

**గుండె వ్యాధి నివారణకు జాగ్రత్తలు**

కరోనా బారిన పడిన వారిలో ఎక్కువ మందికి గుండె, మెదడు, కాలి రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల పక్షవాతం, గుండెపోటు వంటివి అధికంగా వస్తున్నాయి. అలా వచ్చిన వారికి త్రాంబలైసెస్ ఇంజెక్షన్ చేయడంతో సకాలంలో ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. నారాయణి హృదయాలయలో 8 మంది పక్షవాతం వ్యాధికి గురై కాలు, చెయ్యి, నోరు చొచ్చుబడిన రోగులు కోలుకుని యథాస్థితికి చేరుకుని సాధారణ స్థాయికి వచ్చారు. కరోనా బారిన పడిన వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. బిపి, మధుమేహం అదుపులో ఉంచుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తరచూ వైద్య నిపుణులను సంప్రదించాలి. వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఛాతిలో నొప్పి లేదా ఆయాసం, తల తిరగడం వంటి లక్షణాలు వచ్చినప్పుడు ఏదైనా పనిలో ఉంటే ఆ పని నిలిపివేసి వైద్య నిపుణులను సంప్రదించాలి. నిద్రలేమి, ఒత్తిడితో గుండె పోటు సమస్యలు అధికంగా వస్తాయి. ఆహారం నిర్ణీత వేళల్లో తీసుకోకపోవడం వల్ల కూడా గుండె వ్యాధులు వస్తాయి.

**ఆహార జాగ్రత్తలు**

గుండె వ్యాధుల నివారణకు ఆహార జాగ్రత్తలు చాలా అవసరం. ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, సన్నని పౌల్ట్రీ, చేపలను తీసుకోవాలి. ప్యాకేజ్డ్ ఫుడ్, చక్కెర ఉన్న స్నాక్స్, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఆహారంలో అధిక ఉప్పు, చక్కెర, అనారోగ్యమైన కొవ్వు పదార్థాలు ఉండకూడదు. వ్యాయామం, ఆహార అలవాట్లతో గుండె వ్యాధులను నివారించవచ్చు.

# క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

## ఆస్పత్రి ఎమ్‌డి దర్శిపూడి రమేష్‌కుమార్



ప్రజాశక్తి-విజయనగరం కోట

క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో అధునాతన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి ఎమ్‌డి దర్శిపూడి రమేష్‌కుమార్ తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

దేశ వ్యాప్తంగా ఎన్ఆర్ఐ ఆస్పత్రుల ద్వారా రోగులకు అత్యాధునిక వైద్యసేవలు అందుతున్నాయి. విజయనగరంలోని ఆస్పత్రిలో నిష్ణాతులైన వైద్యులతో మెరుగైన సేవలు అందిస్తున్నాం. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, మోకాళ్ల చికిత్స, చిన్న పిల్లల వైద్యం, గ్యాస్ట్రో యాంట్రాలజీ, గైనిక్, ఊపిరితిత్తులు, ఇఎన్‌టి, న్యూరాలజీ, కార్డియాలజీ, యూరాలజి, నెఫ్రాలజీ, కేన్సర్ వంటి వాటికి స్పెషలిస్టు వైద్యులతో సేవలు అందిస్తున్నాం. ప్రత్యేకంగా సంతాన సాఫల్య చికిత్సలతో పాటు దంతవైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిలో మాస్టర్ హెల్త్ చెకప్ అతి తక్కువ మొత్తానికే నిర్వహిస్తున్నాం. రూ.3వేలు విలువ చేసే టెస్టులను రూ.1500కే అందిస్తున్నాం. లిపిడ్ ప్రొఫైల్, డయాబిటిక్ ప్రొఫైల్, బోన్ ప్రొఫైల్, కిడ్నీ ఫంక్షనింగ్, లివర్ ఫంక్షనింగ్, హిమోగ్రామ్ వంటి వైద్యపరీక్షలు చేస్తున్నాం. రూ.699కే డయాబెటిక్ ప్యాకేజి, రూ.1500కు గుండె చెకప్ నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా ముందుగానే రోగాలను గుర్తించి సరైన చికిత్సలు అందించేందుకు అవకాశం ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ హెల్త్ చెకప్ నిర్వహించుకోవాలి.



# నెరవేరిన కల

**సుమారు రెండు దశాబ్దాలుగా జిల్లా వాసులు ఎంతగానో ఎదురు చూస్తున్న మెడికల్ కాలేజీ కల నెరవేరుతోంది. కొన్ని నెలల క్రితమే ఎన్ఎంసి అధికారుల బృందం కళాశాల భవనాలు, క్లినికల్ సదుపాయాలను పరిశీలించింది. సంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా ఇటీవల లెటర్ ఆఫ్ పర్మిషన్ కూడా ఇచ్చారు. కాబట్టి కళాశాల ప్రారంభానికి ఇక ఢోకా లేనట్టే. జులైలో ఎంబిబిఎస్ కౌన్సిలింగ్, ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. ఇటు సర్వజన ఆసుపత్రిలో వైద్య ప్రమాణాలు పెరిగాయి. మౌలిక సదుపాయాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. బోధనా సిబ్బంది పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఇప్పుడిప్పుడే వైద్యారోగ్య సేవలు విస్తరిస్తున్నాయి.**

ఆగస్టులో మెడికల్ కళాశాల అడ్మిషన్లు

150 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు

శరవేగంగా భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గాజులరేగ సమీపంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం తరపున మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది. మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, లేబొరేటరీ తదితరాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ విభాగం కూడా ఆసుపత్రిలో కొనసాగుతోంది. భవన నిర్మాణం పూర్తికాగానే ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ఇక్కడి నుంచి పరిపాలన సాగించేందుకు సమాయత్త మవుతున్నారు. ఈ ఏడాది ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. 150సీట్లు మంజూరయ్యాయి. జులైలోనే అండర్ పోస్టు గ్రాడ్యుయేట్ (ఎంబిబిఎస్) కౌన్సిలింగ్, ఆగస్టులో అడ్మిషన్లు నిర్వహించే దిశగా అడుగులు పడుతున్నాయి. కళాశాల మొత్తానికి 222 ప్రొఫెసర్ పోస్టులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు సుమారు 192 పోస్టులు భర్తీ అయ్యాయి. కానీ, మొదటి సంవత్సరం బోధనకు ఇబ్బంది లేదు. మిగతా 30 పోస్టుల్లో కొన్ని రాష్ట్ర కేంద్రం, మరికొన్ని రీజనల్, ఇంకొన్ని కళాశాల స్థాయిలో భర్తీచేయాల్సి ఉంది. ఇవన్నీ క్రమంగా రెండు, మూడు సంవత్సరాల్లో భర్తీ చేయాల్సినవేనని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, కమ్యూనిటివ్ మెడిసిన్ వంటి నాలుగు విభాగాలు అవసరమౌతాయి. వీటికి సంబంధించిన టీచింగ్ పరికరాలు, ఫర్నీచర్, టీచింగ్ మెటీరియల్, లేబోరేటరీ, వైద్య పరికరాలు వంటివి యుద్ధ ప్రాతిపదికన సమకూరుస్తున్నామని, ఇప్పటికే బెంచీలు ఏర్పాటు చేశామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ప్రజాశక్తికి తెలిపారు. ఈ విభాగాలకు అవసరమైన అధ్యాపక బృందమంతా సిద్ధంగా ఉంది. గాజులరేగ పరిధిలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మొదటి సంవత్సరంలో 150 మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, ప్రొఫెసర్ల ఛాంబర్లు, లేబోరేటరీ గదులు సిద్ధంగా ఉన్నాయి. వాటికి ప్రస్తుతం తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఇటీవలే వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని, వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఈ నిర్మాణాలను పరిశీలించారు. కలెక్టర్ కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. వీరంతా చేసిన సూచనలు, సలహాలతో అక్కడి కాంట్రాక్టరు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. మొత్తానికి మెడికల్ కళాశాల ఏర్పాటు, ప్రారంభం జిల్లాలో మైలు రాయివంటిదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కళాశాల పూర్తిస్థాయిలో విస్తరించేనాటికి అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆవిధంగా జిల్లా ప్రజానికానికి సర్కారు వైద్యం అందుబాటులోకి వస్తుందని, ఏటా వందలాది మంది వైద్యులు జిల్లా నుంచి తయారవుతారని ఆశిద్దాం.

### తరగతుల నిర్వహణకు ఢోకాలేదు



ఈ ఏడాది మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ తరగతులు మాత్రమే జరుగుతాయి. తరగతుల నిర్వహణకు ఢోకాలేదు. మొదటి సంవత్సరంలో అవసరమైన అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలతో ఏర్పాటు చేయాల్సివుంది. వీటితోపాటు తన ఛాంబర్, లేబొరేటరీ తదితరాలకు అవసరమైన భవనాలు, గదులు సిద్ధంగా ఉన్నాయి.

డాక్టర్ కె.పద్మలీల,
మెడికల్ కళాశాల ప్రిన్సిపల్

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**చర్మవ్యాధుల నిపుణులు ఎం.సత్యనారాయణమూర్తి**



ప్రజాశక్తి-బొబ్బిలి

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని చర్మవ్యాధుల నిపుణులు ఎం.సత్యనారాయణమూర్తి అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే దురద, తామర, గజ్జి వంటి చర్మవ్యాధులను నివారించవచ్చు. కాలుష్యం వల్ల, కలుషిత నీటిలో స్నానం చేయడం వల్ల చర్మ వ్యాధులు వస్తాయి. చర్మం ఎరుపుగా మారడం, మంట రావడం, శరీరంపై గడ్డలు, ఎండుబారడం, ఊడిపోవడం, బొబ్బర్లు వంటి లక్షణాలు కనిపిస్తే చర్మవ్యాధుల వైద్యులను సంప్రదించాలి. బహిర్భూమికి వెళ్లిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.

# వైష్ణవ్ హార్ట్‌కేర్‌లో అధునాతన వైద్యసేవలు

## వెంకటరమణ ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు



**ప్రజాశక్తి-విజయనగరం కోట**

నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు సమీపంలోగల వెంకట రమణ ఆస్పత్రిలోని వైష్ణవ్ హార్ట్‌కేర్‌లో అధునాత వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

డాక్టర్ వైష్ణవ్ పేరుమీద హార్ట్ కేర్‌ను స్థాపించి సుమారుగా సంవత్సరం అయింది. ఈ హార్ట్ కేర్‌లో అత్యాధునిక టెక్నాలజీని తీసుకు వచ్చాం. కేథ్ ల్యాబ్ ద్వారా యాంజి గ్రామ్, స్టంటింగ్ ఇప్పటివరకు సుమారుగా 1200 కేసులు వరకు విజయవంతంగా అత్యంత అనుభవం గల డాక్టర్లచే పూర్తి చేశాం. రౌండ్ ది క్లాక్ విధానంలో కార్డియాలజిస్ట్, కార్డియాక్ ఎమర్జెన్సీ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. హార్ట్ కు సంబంధించిన అన్ని చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్నాం. అలాగే అన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కార్డుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక అనుభవం కలిగిన వైద్యులు 24 గంటలూ అందు బాటులో ఉంటార న్నారు. ప్రత్యేకంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన రోగులకు బిఎస్‌కెవై కార్డులు ద్వారా కూడా వైద్యం అందిస్తున్నాం. కేథ్‌ల్యాబ్ లో ఆదిత్య నృసేన్, సుజిత్‌నాయుడు, గౌరీశంకర్‌రెడ్డి వంటి అనుభవజ్ఞులైన వైద్యులు, సిస్టర్స్ అందుబాటులో ఉన్నారు. అంతే కాకుండా ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులు, జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలకు స్పెషలిస్టుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

# రక్తహీనతే వ్యాధులకు మూలం

## డాక్టర్ ఎ.గోపినాథ్



**ప్రజాశక్తి-బొబ్బిలి**

రక్తహీనతతో అనారోగ్యం పాలవుతారని శ్రీవేణుగోపాల నర్సింగ్ హోం వైద్యులు ఎ.గోపినాథ్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రక్తహీనతతోనే వ్యాధులు అధికంగా వస్తున్నాయి. దీన్ని అధిగమించేందుకు ఆకు కూరలు, గుడ్లు, పాలు, చేపలు, మాంసకృత్తులు, పప్పుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం లేనివారు బెల్లం తీసుకుంటే రక్తహీనతను త్వరగా అధిగమించొచ్చు. ఫైల్స్, మహిళల్లో ఓవర్ బ్లీడింగ్‌తోనూ ఈ సమస్య ఏర్పడొచ్చు. నీరసం, అలసట, నిరుత్సాహం వంటి లక్షణాలు రక్తహీనతతో వస్తాయి. వైద్యులను సంప్రదించి సరైన ఆహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చు. ప్రధానంగా అన్ని రకాల పోషకాలుండే ఆహారాన్ని తీసుకోవాలి.

దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు పెరిగి పోతున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడితే చిల్లంగి పెట్టారని అపోహలతో రక్షలు, పూజలు చేసి మృత్యువాత పడుతున్నారు. వ్యాధులు వస్తే వైద్యులను సంప్రదించాలి. అంతే తప్ప మంత్రాలకు చింతకాయలు రాలవు. మలేరియాను నివారించేందుకు దోమతెరలను వాడాలి. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. ఆర్‌ఎంపి వైద్యులను సంప్రదించి నిర్లక్ష్యం చేయకూడదు. చలిజ్వరం, ఒళ్లు, తలనొప్పి, పచ్చకామెర్లు, వాంతులు వస్తే మలేరియా లక్షణాలుగా భావించాలి. మలేరియాకు చికిత్స పొందకపోతే సెరిబ్రల్ మలేరియాగా మారి రోగి కోమాలోకి వెళ్లిపోతారు. ఇది ప్రాణాలకే ముప్పు కలిగిస్తుంది. సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఫాస్ట్‌ఫుడ్స్, రోడ్డు పక్కన అమ్మేవి తినకూడదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

# బ్రెయిన్‌స్ట్రోక్ పట్ల అప్రమత్తం

## న్యూరాలజిస్ట్ డాక్టర్ నిర్మల




**ప్రజాశక్తి-విజయనగరం కోట**

బ్రెయిన్‌స్ట్రోక్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ వంగపండు నిర్మల తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

బ్రెయిన్ స్ట్రోక్ రెండు రకాలు. ఒకటి.. బ్రెయిన్‌కు వెళ్లే రక్త నాళాల్లో రక్తం క్లాట్ అవ్వడం వల్ల స్ట్రోక్ వస్తుంది. రెండోది హెమరేజింగ్ స్ట్రోక్ అంటే బ్రెయిన్‌కు రక్త నాళాలలో రక్త ప్రసరణ శక్తిని తట్టుకోలేక రక్త ప్రసరణ జరగడం. హెమరేజింగ్ స్ట్రోరీ 15శాతం మందిలో చూస్తే ఇన్‌కెమిక్ స్ట్రోక్ 85శాతం కేసుల్లో చూస్తుంటాం. బ్లడ్‌ప్లజర్, హైపర్ టెన్షన్, సుగర్, పొగతాగడం, అల్కాహాల్, చెడు కొవ్వు వంటి వాటి ద్వారా స్ట్రోక్ వస్తుంది. అయితే వీటిని కంట్రోల్ చేసుకోవచ్చు. తద్వారా స్ట్రోక్‌ను కంట్రోల్ చేసుకోగలం. నాన్ మెడబుల్ ఫ్యాక్టర్స్ స్ట్రోక్ అనేది మన చేతిలో లేనిది. వయసు, వారసత్వంగా పురుషుల్లో కొంతమందికి రిస్కు ఉంటుంది. 55ఏళ్ల తరువాత రిస్కు ఎక్కువగా ఉంటుంది.

**ఏ సమయంలో డాక్టర్ వద్దకు వెళ్లాలంటే..**

బాగా మాట్లాడుతున్న వ్యక్తి మాట తడబాటు రావడం, కాళ్లు చేయి పనిచేయకపోవడం, చూపు మందగించడం, ప్రతిదీ డబుల్‌గా కనిపించడం, బ్యాలెన్సు తప్పడం, కంగారు పడడం ..ఇలా ఏది కనిపించినా వెంటనే న్యూరాలజీ డాక్టర్ వద్దకు వెళ్లాలి. సిటి స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ చేసి రక్తం గడ్డ కట్టిందా, రక్త ప్రసరణ జరుగుతుందా లేదా చూసి వైద్యసేవలు అందిస్తాం. స్ట్రోక్ వచ్చిన వారు నాలుగున్నర గంటల్లోగా ఆస్పత్రికి చేరుకోవాలి. క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం, ఆహారపు అలవాట్లు వంటివి అలవర్చుకోవాలి. ఆల్కహాలును నివారించాలి. వైద్యుల సలహాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు.

















# శరీరానికి ఎండ తగిలితే ఎముకల్లో బలం

## ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ కుమార్



**ప్రజాశక్తి- గజపతినగరం**

ప్రతిరోజు సుమారుగా 40 నిమిషాల పాటు శరీరానికి ఎండ తగిలితే ఎముకల్లో బలం చేకూరుతుందని శ్రీ సాయి దుర్గ ఎముకల ఆసుపత్రిలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ బెజవాడ సతీష్ కుమార్ అన్నారు. ప్రస్తుత రోజుల్లో శారీరిక శ్రమకు సమయం ఇవ్వకపోవడంతో విటమిన్ డి లోపం ఎక్కువగా ఉందని, దాంతో చాలామందికి నడుం నొప్పి, కీలవాతం ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఇది అన్ని వయసుల వారిలో కనిపిస్తుందని అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కనీసం 30 నిమిషాలు వాకింగ్ చేయాలి. స్థూలకాయం షుగర్ వంటి వ్యాధులు ఉన్నవారు గంట పాటు వేగంగా నడవాలి. వాకింగ్ కూడా మట్టి రోడ్డు మీద చేయాలి. పరుగు పెట్టడం లాంటివి చేస్తే రెండు కాళ్ల ఎముకల మధ్య ఒత్తిడి ఎక్కువై లేనిపోని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎముకల అరుగుదలకు అనేక కారణాలు కూడా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ సమయానికి మంచి ఆహారం తీసుకోవాలి. పాలు గుడ్లు, చేపలు, అరటి, జామ, ములక్కాయ వంటి కాల్షియం ఇచ్చే ఆహారం తీసుకోవాలి. దాంతో పాటు మంచి వ్యాయామం చేయడం, ఎక్కువసేపు కూర్చునే ఉండకుండా సరైన నియమాలు పాటిస్తే ఎముకల సమస్య నుండి బయటపడవచ్చు. ప్రస్తుత రోజుల్లో ఆన్లైన్ క్లాసులు కంప్యూటర్లో పనుల వల్ల యువత చిన్నారుల్లో ఎముకల సమస్యలు ఎక్కువుగా వస్తున్నాయి. మెడ వెన్నుపూస సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ పనులు చేస్తున్నప్పుడు అనుకూలమైన భంగిమల్లో కూర్చుంటే సమస్యలు తగ్గుతాయి. ప్రస్తుతం ఆ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

# వర్షాకాలంలో పిల్లలతో జాగ్రత్త

## పిల్లల వైద్య నిపుణులు వెంకటరమణ



**ప్రజాశక్తి- గజపతినగరం**

వర్షాకాలంలో చిన్న పిల్లల్లో సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధులతో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని చిన్న పిల్లల వైద్య నిపుణులు బి.వెంకటరమణ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

వ్యాధుల్లో ముందుగా న్యుమోనియా, (శ్వాసకోశ వ్యాధులు) ఆస్తమా, ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. వీటికి ముందు జాగ్రత్తగా టీకాలు వ్యాక్సిన్లు వేసుకోవాలి. ఇదే సీజన్‌లో దోమకాటు ద్వారా మలేరియా డెంగ్యూ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. జ్వరాలకు కారణాలైన దోమల నుంచి రక్షణకి దోమతెరలు వాడటం, జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో వైద్యులను సంప్రదించి ప్రథమ చికిత్స చేయించుకోవాలి. అప్పుడే పుట్టిన పిల్లలు నుండి ఏడాదిన్నర వరకూ పిల్లలకు అన్ని రకాల ప్రభుత్వ వ్యాక్సిన్లు వేసుకోవాలి. వాటిలో ముఖ్యంగా బిసిజి, బిపివి, నేపాడ్ బి, పెంటా వాలెంట్, రోటా వైరస్, న్యూమోకాకల్, మిసిల్స్, బూస్టర్ డోస్, విటమిన్-ఎ (ద్రావణం) వేయించు కోవాలి. పిల్లలకు ఎక్కువగా పోషకాహారం, అన్నం, ఐరన్ రెడ్ ఫుడ్, ఆకుకూరలు, బెల్లం ఉండలు, పప్పులు, గుడ్డు, చేపలు తగిన విధంగా తీసుకోవాలి. నులిపురుగుల మందు (డి వార్మింగ్) ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా వేయించుకోవాలి. చిన్నపిల్లలకు స్కూల్లో కంటి జాగ్రత్తలు చూపించుకోవాలి. కంటి చుక్కలు( ఐ విజన్) స్క్రీనింగ్ చేయించుకోవాలి.



# మానసిక ఆరోగ్యమే ప్రధానం

## జనరల్ ఫిజిషియన్ డాక్టర్ దివాకర్‌బాబు



**ప్రజాశక్తి - బొబ్బిలి**

రోగులు మానసికంగా ధైర్యంగా ఉంటే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని భారతి హాస్పిటల్ వైద్యులు, ప్రముఖ ఫిజిషియన్, డయోబెటిస్ స్పెషలిష్ట్ డాక్టర్ అక్కేనా దివాకర్ బాబు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మానసిక ధైర్యంతో ఎటువంటి అనారోగ్య సమస్యలనైన అధిగమించి ఆరోగ్యంగా ఉండగలం. జబ్బు ఉందని ఊహించుకోవడం, జబ్బు వల్ల జరిగే ప్రమాదాన్ని తలచుకొని కుంగిపోకూడదు. ఇలాంటివి వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించి సరైన సమయానికి చికిత్స తీసుకోవడం వల్ల అనవసర పరీక్షలు, మందుల వాడకం తగ్గించవచ్చు. వయస్సుతో సంబంధం లేకుండా మధుమేహం బారిన పడుతున్నారు. జాగ్రత్తలతో మధుమేహన్ని నివారించవచ్చు. అధిక బరువు, శారీరక శ్రమ తక్కువ ఉన్నవారికి, మానసిక ఒత్తిడి ఎక్కువ ఉన్నవారికి, నిద్రలేమి వంటి సమస్యలు ఉంటే మధుమేహం వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఆహార నియమాలు పాటిస్తూ రోజుకు కనీసం 30 నిమిషాలైన వ్యాయామం చేస్తే మధుమేహాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. మనిషి వ్యాధి నిరోధక శక్తిని బట్టి మధుమేహ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తరచూ మూత్రం రావడం, దాహం ఎక్కువగా వేయడం, గొంతు ఎండిపోతున్నట్లు అనిపించడం, అకారణంగా బరువు తగ్గడం, బాగా నీరసంగా ఉండడం, చూపు మందగించడం, అతిగా ఆకలి వేయడం, కాళ్లలో స్పర్శ తగ్గడం, వృషణాలలో దురద, అంగంలో మంటగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే తప్పక రక్తంలో షుగర్ మోతాదును పరీక్ష చేయించుకోగలిగితే షుగర్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించవచ్చును.

# మురిపాలు అరగంటలో ఇవ్వాలి

## డిసిహెచ్ఎస్ గౌరీశంకర్

ప్రజాశక్తి- గజపతినగరం

'నార్మల్ డెలివరీ అయినప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు (మురిపాలు) అరగంటలో ఇవ్వాలి. తల్లికి నాలుగు పూటలా అన్ని రకాల ఆహార పదార్థాలు (ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, మాంసం మొదలైనవి) అందివ్వాలి. ఉదయం 7 గంటల నుండి ఉపహారం ఇడ్లీ, అట్టు, పూరి మొదలైనవి నచ్చిన కూరతో తగిన మోతాదులో తీసుకోవాలి. గుడ్డు, అరటిపండు తినాలి, మధ్యాహ్న భోజనం 11 నుండి 12 మధ్యలో పూర్తిచేయాలి' అని డిసిహెచ్ఎస్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బి. గౌరీ శంకర్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు, బాలింతల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే..



బాలింతలం మధ్యాహ్న భోజనంలో పప్పు, మెంతికూర, కందిపప్పు అన్నం, చిక్కుడుకాయ, పులుసు కూర అనగా చేపలు, కందికట్టు, పెరుగన్నం ఉండేటట్లు చూసుకోవాలి. సాయంత్రం 4-5 గంటల్లో అల్పాహారంగా స్వీట్లు, అరిసె, బొబ్బట్లు, బూరె, జిలాబి, సేమియా, పాయసం లాంటివి, జొన్నపొత్తు (స్వీట్ కార్న్), అటుకుల ఉప్మా, ఇడ్లీ తీసుకోవాలి. రాత్రి 7 గంటల 30 నిమిషాలకు రాత్రి భోజనం పూర్తి చేయాలి. రాత్రి భోజనంలో కందిపప్పు, అన్నం, కాయగూరలు, పెరుగన్నం తగినంత తీసుకోవాలి. ప్రతి గంటకు ఒక పావు లీటరు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మకాయ నీళ్ల రూపంలో తాగాలి. అరటి, బొప్పాయి, జామ పండ్లు రోజులో రెండు మూడు సార్లు తీసుకోవాలి. నాన్ వెజ్ రోజులు ఒక్కసారి తీసుకోవచ్చు. ఈ విధంగా ఆహారం తీసుకోవడం వల్ల బిడ్డకు పాలు సమృద్ధిగా అందుతాయి. దాని వల్ల బిడ్డ ఎదుగుదలకు సహాయ పడుతుంది. రోజు తల్లికి ఎనిమిది నుంచి పది గంటల వరకు నిద్ర అవసరం. చిన్నపిల్లలు నిద్రపోయే సమయంలో టీవీ సెల్ ఫోన్ వంటి శబ్ద కాలుష్యం ఉండకూడదు. పిల్లలు పాలు తాగే సమయంలో ఎటువంటి భంగం కలిగించకూడదు. ప్రభుత్వ వ్యాక్సిన్లు అన్నీ తరుచుగా డాక్టర్ సలహాతో వేయించుకోవాలి.

# అందమైన చిరునవ్వుకు చిరునామా.. వి- డెంటల్

## డెంటల్ సర్జన్ ఎం.జాన్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రపంచ స్థాయి దంతవైద్య విధానాలతో ఉత్తరాంధ్రలో అత్యుత్తమ దంత వైద్యం అందిస్తుంది వి- డెంటల్ హాస్పిటల్స్ అని కాస్మొటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ జాన్ మాడుగుల, ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ అనిత మాడుగుల, అడ్మిన్‌స్ట్రేషన్ డైరెక్టర్ కెఎంకె రమేష్ తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అనతి కాలంలోనే వి-డెంటల్ ఆస్పత్రుల ద్వారా దంత వైద్య సేవలు విస్తరింపజేసి ప్రజల మన్ననలు అందుకుంది. వి-డెంటల్ సాధించిన విజయాలు అనేకమనే చెప్పాలి. పూర్తి స్థాయి ప్రత్యేక నైపుణ్యం కలిగిన 20 మంది వైద్య బృందం వివిధ రకాల దంత చికిత్సలు అందిస్తున్నారు. నోటిలో పూర్తిగా పళ్లు లేని వారికి సైతం బేసల్ ఇంప్లాంట్స్ ప్రక్రియ ద్వారా శాశ్వత దంతాల అమర్చడం వి-డెంటల్ ప్రత్యేకత. ఎత్తు పళ్ళు, వంకర పళ్లు, పళ్ల మధ్య ఖాళీలు కలిగిన వారికి పంటి వరుసను ఆర్థో ట్రీట్మెంట్ ద్వారా అందంగా తీర్చిదిద్దడంలో నూరు శాతం ఫలితాలు సాధ్యం. చిగుళ్ల సమస్యతో బాధపడే వారికి లేజర్ ఫ్లాప్ ట్రీట్మెంట్ ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు. దంత సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించడంలో వి-డెంటల్ హాస్పిటల్ ప్రత్యేకతను సంతరించుకుంది. వి-డెంటల్ హాస్పిటల్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించి జెసిఐ సంస్థ పురస్కారాన్ని అందించింది.



### సంతాన సాఫల్యానికి

# అధునాతన టెక్నాలజీతో పరీక్షలు

## ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్త్రీల సంతాన సాఫల్య లోపాలను తెలుసుకునేందుకు కొలపర్తి మల్టీస్పెషల్టి ఆసుపత్రిలో అధునాతన టెక్నాలజీతో పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే...



సంతాన సాఫల్య లోపాలు స్త్రీ, పురుషుల్లో సమానంగా ఉంటాయి. భార్యాభర్తలు ఒకేసారి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. సంతాన సాఫల్యతపై అధునాతన టెక్నాలజీతో పరీక్షలు నిర్వహిస్తున్నాం. స్త్రీ, పురుషుల్లో చెరో నలభై శాతం సంతానలేమికి కారణాలైతే తెలియకుండా 10శాతం సాధారణంగా పురుషుల్లో ఉంటుంది. అందుకని భార్యాభర్తలిద్దరూ పరీక్షలు చేసుకోవడం తప్పనిసరి. ఎక్కువగా వీర్యకణాలు లేకపోవడం, వీర్యకణాల్లో చలనం తక్కువగా ఉండడం, సారూప్యతలో లోపాలు పురుషుల్లో కనబడతాయి. స్త్రీల్లో అయితే గర్భాశయంలో లోపాలు అందులో కణతులు, ఇన్ఫెక్షన్ వ్యాధులు అన్నవాహిక మూసికొని పోవుట, అండాశయంలో అండాల ఉత్పత్తి లేకపోవడం ఇలా అనేక లోపాలుంటాయి. హార్మోన్ల సమతుల్యత, గర్భాశయం, అండాశయాలు, అన్నవాహికల స్థితి, అండ వాహికలు నార్మల్, అడ్డంకులు కలిగి ఉన్నాయా, ఉత్పత్తి సక్రమంగా ఉన్నదా లేదా తెలుసుకొనేందుకు పరీక్షలు చేసే అధునాతన వైద్య పరికరాలతో చికిత్స అందిస్తున్నాం. వీర్య కణాలను సన్నటి ప్లాస్టిక్ కెథీటరీ ద్వారా భార్యకు గర్భాశయంలో ప్రవేశపెట్టే ఐయుఐ టెక్నాలజీతో చికిత్స చేస్తాం. మరో ముఖ్యమైన ఐవిఎఫ్ చికిత్స భర్త నుంచి సేకరించిన మంచి చలనం కలిగిన వీర్య కణాలను భార్య నుంచి తీసిన అండాలను లేబరేటరీలో ఫలదీకరణం చేసి మూడు, ఐదు రోజుల వరకు ఇంక్యుబేటరీలో వాటిని జాగ్రత్తగా పెంచి పిండాలను గర్భకోశయంలోనికి మార్పిడి చేసే అత్యాధునిక వైద్య చికిత్స నిర్వహిస్తున్నాం. మా నుంచి క్రమపద్ధతిలో స్కానింగ్, చికిత్స చేయించుకున్న గర్భిణులు ఎలాంటి అవకతవకలూ లేకుండా కాన్పులు చేయడం ద్వారా ఆరోగ్యకర శిశువులు జన్మించడం జరుగుతుంది.

### వైద్యం కన్నా..

# నివారణ చర్యలే ముఖ్యం

## జామి పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - జామి

ప్రస్తుత రోజుల్లో వైద్యం కన్నా... రోగం రాకుండా ముందస్తు చర్యలే ప్రధానమని జామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్.సామ్రాజ్యలక్ష్మి అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే...



వైద్యులపై నమ్మకం పెరిగినప్పుడు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్లు కృషి చేస్తారు. ప్రతి డాక్టర్ రోగికి మంచి వైద్యం అందించడమే ధ్యేయంగా పని చేస్తారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించింది. ప్రధానంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఎంతో ఆదరణ పొందుతోంది. గర్భిణులకు, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తుంది. ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వర్షా కాలం ప్రారంభ మవుతున్న నేపథ్యంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి. సమీప ఆరోగ్య కార్యకర్తల ద్వారా పిహెచ్‌సిల సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

# దంతాలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి- విజయనగరం

మనిషికి దంతాలు చాలా ముఖ్యమైనవి. ఆరోగ్యకరమైన దంతాలు మీకు అద్భుతమైన చిరునవ్వును ప్రదర్శించడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మీకు సహాయపడతాయి. ఒక దంతం లేదా ఎక్కువ దంతాలు లేకపోవటం వల్ల నమలడం, మాట్లాడటం వంటి సాధారణ పనులు చాలా కష్టతరం అవుతాయి. పైగా ఒక దంతం కోల్పోవడం వల్ల ముందరి దంతం వెనక దంతం ముందరికి జరిగి నమలడానికి కష్టంగా ఉంటుంది. అందు వల్ల మనం దంతాలను తీయించకుండా కాపాడు కోవాలి. పిప్పళ్ళు, తిన్న పదార్థాలు పళ్ల మధ్య ఇరుక్కుండిపోతున్నా, నొప్పి అని తెలిసినపుడే దగ్గరలో ఉండే దంత వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడు దగ్గరికి వెళ్ళిన తరువాత ఆయన పరిశీలించి దంతం మీద ఉన్న రంధ్రాన్ని సిమెంట్ ద్వారా కప్పి సర్దుబాటు చేస్తారు. సిమెంట్ చేసినప్పుడు ఇంజక్షన్ గాని, నొప్పి గాని ఉండదు. అలాంటి సమయంలోనే దంత వైద్యుడిని సంప్రదించడం వల్ల ఖర్చు కూడా బాగా తక్కువ అవుతుంది. కానీ నొప్పి లేదు అని అశ్రద్ధ చేయడం వల్ల



దంతంలో ఉండే నరం వరకు పిప్పి ప్రాకడం వల్ల భరించలేని నొప్పి వస్తుంది. ఆ సమయంలో గాని దంత వైద్యుడుని సంప్రదిస్తే రెండు మార్గాలను మాత్రమే సూచిస్తారు. ఒకటి దంతాన్ని తీసి వేయడం, రెండు దంతాన్ని కాపాడుకోవడానికి రూట్ కెనాల్ చికిత్స. ఈ రెండు పద్ధతులల్లోనూ ఇంజక్షన్ చేయాలి. మందులు వాడాలి. అందుకే దంతాలు ఎక్కువ పాడవకుండానే చికిత్స చేసుకోవాలి. చాలా మందికి రూట్ కెనాల్ చికిత్స అవగాహన లేక దంతాలను పీకించేసుకుంటారు. అలా తీయించుకోవడం వల్ల నవ్వడంలో ఇబ్బంది, తినడంలో కష్టం, దంతాలు జరగడం మొదలగునవి జరుగుతాయి. అలాంటి సమయంలో దంతాల అమరిక వివిధ పద్ధతుల ద్వారా చేయవచ్చు. వాటిలో ముఖ్యమైనవి. చాలా సరళంగా, ఫిక్సడ్ దంతాలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ తప్పిపోయిన దంతాల మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది.

ఫిక్సడ్ దంతాలు (fixed Bridge) తయారు చేసే ప్రక్రియలో సాధారణంగా దంతవైద్యున్ని అనేక సార్లు సంప్రదించాల్సి ఉంటుంది. ఇంప్లాంట్‌ను పెట్టడం, ఫిక్సడ్ దంతాలు అమర్చడం, పోయిన దంతాల ప్రదేశంలో ఫిక్సడ్ దంతాలు ఉంచడం వంటి ప్రక్రియలకు సమయం పడుతుంది. ఫిక్సడ్ దంతాలు ఏర్పడిన తర్వాత, స్థిరమైన ఫిక్సడ్ దంతాలు సహజ దంతాల మాదిరిగా కనిపించి, మంచి అనుభూతి ఉంటుంది. చాలా కాలం పని చేస్తుంది. శుభ్రపరచడం కోసం తొలగించాల్సిన అవసరం ఉండదు. సాధారణంగా దంతాల ఇంప్లాంట్ కంటే చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్నది.

**రెండవ పద్ధతి**

తొలగించగల పాక్షిక కట్టుడు పళ్ళు (removable partial denture) తప్పిపోయిన దంతాల యొక్క చిన్న విభాగానికి ప్రత్యామ్నాయ దంతాలను కలిగి ఉంటాయి. సాధారణ రూపంలో కనిపిస్తాయి. పని చేస్తాయి. తొలగించగల పాక్షిక కట్టుడు పళ్ళు నమలడానికి, సౌందర్య ఆకర్షణకు గొప్పగా ఉన్నప్పటికీ, అవి టూత్ ఇంప్లాంట్ లేదా ఫిక్సడ్ దంతాలు కంటే చాలా తక్కువ మన్నిక కలిగి ఉంటాయి. ఎక్కువ సమయం ధరించినప్పుడు అసౌకర్యంగా మారవచ్చు. కానీ అవి సాధారణంగా అందుబాటులో ఉన్న అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన దంతాల భర్తీ ఎంపిక, ఏదైనా నష్టం జరిగితే వాటిని సరిచేయడం సులభం.

**ఇక చివరి పద్ధతి**

**డెంటల్ ఇంప్లాంట్:** దంత ఇంప్లాంట్ అనేది ఒక శస్త్ర చికిత్సా ప్రక్రియ. దీనిలో దవడ ఎముకతో భర్తీ చేయబడిన దంతాల మూలాన్ని ఉంచి కలుపుతారు. ఒకే దంతాన్ని భర్తీ చేసేటప్పుడు దంత ఇంప్లాంట్లు బాగా పనిచేస్తాయి. బహుళ దంతాల భర్తీకి అవి ఉత్తమ ఎంపిక కాకపోవచ్చు. డెంటల్ ఇంప్లాంట్లు సహజమైన దంతాల రూపాన్ని, అనుభూతిని అందిస్తాయి. మరమ్మతులు లేదా భర్తీ చేయవలసిన అవసరం లేకుండా దశాబ్దాలు కాకపోయినా సంవత్సరాల పాటు కొనసాగుతాయి. అయినప్పటికీ, దంత ఇంప్లాంట్‌కు శస్త్రచికిత్స అవసరం. సాధారణంగా వంతెనలు లేదా కట్టుడు పళ్ళ కంటే ఎక్కువ ఖర్చు అవుతుంది.

**- డాక్టర్ కామేశ్వరరావు,**
**దంతవైద్య నిపుణులు, విజయనగరం**



# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

## గుర్ల పిహెచ్‌సి వైద్యాధికారి షర్మిలి

ప్రజాశక్తి - గుర్ల



సీజనల్ వ్యాధుల పై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ బి.షర్మిలి అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం శానిటేషన్, క్లోరినేషన్ చేయించడం, పారిశుధ్యం మెరుగు పడడం వల్ల ప్రజలు ఆరోగ్యం ఉంటారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో ప్రజలకు మర్రిని వైద్య సేవలు అందిస్తున్నాం. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ఒపి 80 నుండి 100 మంది వరకు వస్తున్నారు. వచ్చిన వారికి హెల్త్ కాన్సిలింగ్ చేస్తున్నాం. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు వేడి చేసి, చల్లార్చిన నీరు తాగాలి. ఈగలు వాలకుండా వండిన ఆహారంపై మూతలు పెట్టాలి. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కో వాలి. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న విద్యార్థులు, పిల్లలను క్రమంగా తనిఖీలు చేసి వారికి కావలసిన మందులు అందజేస్తున్నాం. సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచనలను, సలహాలను ప్రజలు పాటించాలని ఆమె కోరారు.

# వైద్యులపై నమ్మకం పెరగాలి

## అలమండ పిహెచ్‌సి వైద్యాధికారి పద్మావతి

ప్రజాశక్తి - జామి



వైద్య వృత్తి చేపట్టిన ప్రతి డాక్టర్ రోగి క్షేమం కోసమే పని చేస్తారని అలమండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పద్మావతి అన్నారు. వైద్యులపై నమ్మకం పెరిగినప్పుడు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్లు కృషి చేస్తారన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రస్తుత రోజుల్లో వైద్యం ఖరీదవడంతోపాటు వైద్యుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో వైద్యం కోసం వచ్చేవారు, థర్డ్ ఒపీనియన్ తీసుకుంటున్నారు. అయితే రోగికి సానుకూల దృక్పథం వల్లే మంచి జరుగుతుంది. ప్రతి డాక్టర్ రోగికి మంచి వైద్యం అందించడమే ధ్యేయంగా పనిచేస్తారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించింది. ప్రధానంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఎంతో ఆదరణ పొందుతోంది. గర్భిణులకు, బిపి, షుగర్ వంటి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తుంది. ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అలమండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మూడు సార్లు కాయకల్ప అవార్డు లభించింది. రానున్న కాలంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి. సమీప ఆరోగ్య కార్యకర్తలు ద్వారా పిహెచ్‌సిల సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

# పెరిగిన దంత సమస్యలు

## దంత వైద్యులు దివ్య



ప్రజాశక్తి- గజపతినగరం

దంతాల సమస్య ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగింది. మన ఆహారపు అలవాటులో వచ్చిన మార్పుల వల్ల దంతాల సమస్యలు అధికమవుతున్నాయి. ఎక్కువగా పిప్పళ్ళు, దవడవాపు, చిగురు నుంచి రక్తం కారడం ఉంటే సమస్యలు వస్తాయి. మనం ఈ సమస్యలలో ఏది ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని దంతవైద్యనిపుణులు తొత్తడి దివ్య అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే..

పిప్పళ్ళు చిన్నగా ఉన్నప్పుడే డాక్టర్‌కు చూపించుకొని ఫిల్లింగ్ చేసుకోవాలి. పన్ను నొప్పి ఉంటే పన్ను తీసుకోవడం లేక తీసివేయకుండా ప్రూట్ కెనాల్ ట్రీట్మెంట్ చేసుకోవచ్చు. చిగురు సమస్య ఉన్నవాళ్లు పళ్ళు క్లీనింగ్ చేసుకోవాలి. చాలామంది పళ్ళు తీసుకుంటే కంటి చూపుకు ప్రమాదమని, పళ్ళు క్లీనింగ్ చేయించుకుంటే కదిలిపోతాయని అంటారు అది అపోహ మాత్రమే. ప్రతి ఒక్కరూ రెండు పూటలా బ్రష్ చేసుకోవడం మంచిది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి డెంటిస్ట్‌ని సంప్రదించాలి. పళ్ళు లేనప్పుడు మన జీర్ణశక్తి తగ్గిపోతుంది. అందువల్లనే వేరే ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందువల్ల పళ్ళు బ్రిడ్జ్ మెథడ్‌లో కానీ ఇంప్లాంట్ మెథడ్‌లో గాని కట్టించుకోవాలి. జ్ఞాన దంతాల సమస్య టీనేజ్ పిల్లల్లో ఎక్కువగా చూస్తాం. వంకరగా ఉన్న పళ్ళు సర్జరీ చేసి తీయించుకోవాలి. మన నోరు శుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం మంచిగా ఉంటుంది. పైన ఉన్న ఏ సమస్య మనలో కనిపించిన వెంటనే డెంటిస్ట్‌ని సంప్రదించాలి. గజపతినగరంలో శ్రీ సాయి దివ్య డెంటల్ క్లినిక్‌లో పళ్లకు సంబంధించి ఏ సమస్య అయినా చక్కగా నొప్పి ఇబ్బంది లేకుండా వైద్యం అందిస్తాం.



# పెరుగుతున్న మధుమేహ రోగులు

## గుండె, ఊపిరితిత్తుల వైద్యునిపుణులు డాక్టర్ ఎన్‌కె రావు



ప్రజాశక్తి - బొబ్బిలి

కరోనా అనంతరం మధుమేహ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, కోవిడ్ సోకిన వారికి షుగర్ స్థాయిలు బాగా పెరుగుతున్నాయని ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎన్‌కె రావు తెలిపారు. డాక్టర్స్ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

కోవిడ్ నిర్ధారణ అయ్యాక స్వల్పలక్షణాలే ఉన్నా, లక్షణాలేవీ లేకపోయినా వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో వచ్చిన సందేశాలను అనుసరించి మొదటి రోజు నుంచే స్టెరాయిడ్స్ వాడడం వల్ల మధుమేహం రోగుల్లో రక్తంలో గ్లూకోజ్ శాతం విపరీతంగా పెరుగుతోంది. ఇదివరకు మధుమేహం లేని వారికి కూడా కొత్తగా కనిపిస్తోంది. కోవిడ్ బారినపడి ఊపిరితిత్తులు ప్రభావమైన వారిలో సహజ లక్షణమైన సాగే గుణం కొంత మేర తగ్గుతుంది. దూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి. ఇమ్యూనిటీ పెంచుకోవడం కోసం మాంసాహారాన్ని అతిగా తీసుకోవడం మంచిది కాదు. దీంతోపాటు ఆకుకూరలు, కాయకూరలు, పాలు, పండ్లు అన్నీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మాంసాహారం మాత్రమే అధికంగా తీసుకోవడం వల్ల రక్తంలో కొవ్వుశాతం పెరిగి గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

# నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

## కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.హారిక



ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.హారిక అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె మాటల్లోనే..

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నెలకు రెండు సార్లు గ్రామాలను సందర్శిస్తున్నారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయు)తోపాటు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒపి సేవలు అందిస్తున్నాం. మంచానికి పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను మధ్యాహ్నం నుంచి పరామర్శిస్తూ ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నాం. ఇప్పటికే పిహెచ్‌సి పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ వందలాది మందికి వైద్య సేవలు అందించాం. ప్రాథమికంగా ప్రజలకు వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనేది లక్ష్యం. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రాథమిక వైద్య సేవల్లో భాగంగా ప్రతి 2 వేల మందికి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ విలేజ్ క్లినిక్‌లో అన్ని రకాల వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంటాయి. గ్రామస్థాయిలో నయం కాని ఆరోగ్య సమస్యలున్న వారిని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. చిన్న పిల్లలు, గర్భిణులకు కూడా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ విలేజ్ క్లినిక్‌కు టెలీ మెడిసిన్, టెలీ హబ్‌ల ద్వారా మెడికల్ ఆఫీసర్‌తోపాటూ ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. ఆశావర్కర్లు వైద్యం అవసరమైన వారిని గుర్తిస్తారు. పిహెచ్‌సి పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా కృషిచేస్తున్నాం.

# కాల్షియం తగ్గితే రెకెట్స్ ప్రమాదం

## ఎముకలు, కీళ్లు, వెన్నెముక వైద్య నిపుణులు అనిల్‌కుమార్



ప్రజాశక్తి-బొబ్బిలి

చిన్నపిల్లల్లో కాల్షియం తగ్గితే రెకెట్స్ వచ్చే ప్రమాదముందని ఎముకలు, కీళ్ళ, వెన్నెముక వైద్య నిపుణులు బి.అనిల్‌కుమార్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే... కాళ్లు, చేతులు వంకర పోవడం, పిల్లల్లో ఎదుగుదల తగ్గడం వంటి లక్షణాలు ఉంటే కాల్షియం తగ్గినట్టే. ఇంట్లో, బయట పడిపోయిన సమయంలో రక్తం కనిపించకుండా తగిలిన దెబ్బలకు తైలం, అమృతాంజన్ రాయకుండా ఐస్‌ముక్కలను గుడ్డలో వేసి దెబ్బతగిలిన చోట పెడితే నొప్పి తగ్గుతుంది. అమృతాంజన్, తైలంతో మర్దన చేస్తే లాభాల కంటే నష్టమే ఎక్కువ. ఐస్‌ముక్క పెట్టడంతో శరీర భాగంలో గూడుకట్టుకున్న రక్తం పలుచబడుతుంది. దెబ్బతిన్న రక్తనాళాలు అరికట్టబడతాయి. పై నుంచి పడిపోయిన సమయంలో కాళ్లు, చేతులు విరిగి వంకరగా కనిపిస్తే పొడవాటి అట్టముక్క లేదా చెక్క పెట్టి గుడ్డతో కట్టుకడితే నొప్పి తగ్గుతుంది. కాల్షియం తగ్గితే ఎముకలు బలహీనం పడటంతోపాటు కీళ్లవాపులు వస్తాయి.

# 'ఇలిజారావ్'తో మెలితిరిగిన ఎముకలకు చికిత్స

## శ్రీసాయి కృష్ణ హాస్పిటల్ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు రామకార్తీక్



**ప్రజాశక్తి-శృంగవరపుకోట**

ఇలిజారావ్ అనే పద్ధతి ద్వారా మెలితిరిగి ఉన్న ఎముకలు సరిచేయనున్నట్లు శ్రీసాయికృష్ణ హాస్పిటల్ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ రామకార్తీక్ తెలిపారు. పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ హాస్పిటల్‌లో సకల సదుపాయాలతో రోగులకు చక్కటి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

రష్యాలో కురుగంలో ఇలిజారావ్ అనే పద్ధతిని ఆంధ్రప్రదేశ్ నుంచి మొట్టమొదటిసారిగా నేర్చుకున్నాం. శ్రీసాయికృష్ణ హాస్పిటల్‌లో మెలితిరిగి ఉన్న ఎముకలు సరిచేస్తున్నాం. లోన్గా వైకల్యం, పొట్టిగా ఉన్న కాలిని పొడుగు చేయడం, ఇన్ఫెక్ట్ అయిన దుమ్ములను సరిచేస్తాం. ఇన్ఫెక్ట్ అయిన దుమ్ములు, ఇన్ఫెక్షన్ వల్ల ఆ అవయం తీయకుండా ఈ ఆపరేషన్ ద్వారా సరిచేయవచ్చు. శ్రీసాయికృష్ణ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన రంధి త్రినాథరావు జనరల్ సమస్యలకు, షుగర్, థైరాయిడ్ ఇబ్బందులకు వైద్య సేవలను అందిస్తారు. డాక్టర్ సిరికి ఫణిశ్రీ ప్రసూతి, సంతాన సౌఫల్య వైద్యనిపుణులు. ఆమె ద్వారా స్త్రీలకు వైద్య సేవలు అందుతున్నాయి. దవడ ఎముకలు విరిగిన, పళ్లు వంకరలు ఉన్నా దంత వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణకిశోర్ అన్నివేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.

# చిన్నపిల్లల్లో మూర్ఛ పట్ల అప్రమత్తం

## ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిడికె సోమశేఖర్



**ప్రజాశక్తి-శృంగవరపుకోట**

చిన్నపిల్లల్లో జ్వరానికి సంబంధించిన మూర్ఛ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిడికె సోమశేఖర్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పిల్లల్లో వచ్చే ఈ మూర్ఛ వ్యాధికి సంబంధించి శృంగవరపుకోట పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి క్లినిక్‌లో ఆధునిక పద్ధతిలో వైద్యాన్ని అందిస్తున్నాం. ఈ మూర్ఛ చిన్నపిల్లల్లో ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వరకు వస్తుంది. మూర్ఛ వచ్చే సమయంలో పిల్లలు స్పందించకపోవడం, నోటి నుండి నురగ రావడం, పళ్లు బిగించడం, శరీరమంతా బిగుతుగా అవ్వటం జరుగుతుంది. మూర్ఛ వల్ల పిల్లల మెదడు, తెలివితేటల మీద ప్రభావం ఉండదు.

**జ్వరం వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...**

ముందుగా శరీర ఉష్ణోగ్రత రికార్డు చేయాలి. బట్టలు వదులుగా ఉంచాలి. నీరసం రాకుండా ద్రవపదార్థాలు ఎక్కువగా ఇవ్వాలి. శరీరాన్ని తడి గుడ్డతో తుడవాలి. పారాసిట్మల్ వేయాలి. ఫిట్స్‌కు సంబంధించిన మాత్రలు మింగించాలి.

**ఫిట్స్ వచ్చినప్పుడు జాగ్రత్తలు..**

ఫిట్స్ వచ్చినప్పుడు భయపడకూడదు. ఫిట్స్ వచ్చినప్పుడు నేలపైన గాని, గట్టిగా ఉండే సర్ఫేస్‌పైన గాని ఉంచాలి. ఎడమవైపునకు తిప్పి ఉంచాలి. నోటి ద్వారా మందులు ఇవ్వకూడదు. అలా ఇస్తే అవి ఊపిరితిత్తులలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. చేతిలో ఇనుము లేదా పదునైన వస్తువులు పెట్టకూడదు. ఫిట్స్ మూడు నుంచి నాలుగు నిమిషాలలో తగ్గకుంటే వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. పిడియాట్రిక్ సూచనల మేరకు మిడియా జ్వలం నాసల్ స్ప్రే ఉపయోగించాలి.




# ఆహార అలవాట్లలో జాగ్రత్తలు వహించాలి

## ప్రముఖ వైద్యులు డాక్టర్ రంధి త్రినాథరావు



**ప్రజాశక్తి-శృంగవరపుకోట**

ప్రస్తుతం ఆధునిక ఆహారపు అలవాట్లలో చాలా వరకూ విషపూరితం, కలుషితం అయిపోయాయని, వాటి వల్ల షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులు సంభవిస్తున్నాయని షుగర్, థైరాయిడ్, జనరల్ సమస్యల వైద్య నిపుణులు డాక్టర్ రంధి త్రినాథరావు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

నేటి సమాజంలో ఆహార అలవాట్లలో మార్పులు రావడం, శారీరక శ్రమ తగ్గడం, పని ఒత్తిడి పెరగడం, పరిశ్రమలు, వాహనాల సంఖ్య పెరిగి వాతావరణం కలుషితమైపోతోంది. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడుతోంది. దీనివల్ల షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. గతంలో పట్టణవాసులలో ఎక్కువగా ఉండేది. నేడు గ్రామాల్లోని ప్రజలలో కూడా ఈ వ్యాధులు కనిపిస్తున్నాయి. మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉన్న వారిలోనే కాకుండా పాలిష్ చేసిన బియ్యం వాడటం, కూల్‌డ్రింక్స్ తాగడం, బంగాళదుంప చిప్స్, బిర్యాని, ఫాస్ట్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల షుగర్ వ్యాధితోపాటు గుండె జబ్బులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

వంశపారపర్యంగా వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. అతిమూత్రం, ఆకలి ఎక్కువగా వేయడం, బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకొని మందులు వాడాలి. అందుకు అత్యాధునిక ల్యాబ్, డిజిటల్ ఎక్స్‌రే సదుపాయాలతో శృంగవరపుకోట పట్టణంలోని శ్రీసాయికృష్ణ హాస్పిటల్ అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తోంది.




# సంజీవనిలో అత్యాధునిక వైద్య సేవలు



## ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు ఎం.వేణు

**ప్రజాశక్తి - శృంగవరపుకోట**

శృంగవరపుకోట పట్టణంలోని రవీంద్ర భారతి స్కూల్ సమీపంలో సంజీవని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యంత అనుభవం కలిగిన వైద్యులతో అత్యాధునిక పరికరాలతో 24/7 వైద్య సేవలను అందిస్తున్నామని ఎముకలు, కీళ్ళ వైద్య నిపుణులు డాక్టర్ మళ్లా వేణు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

శృంగవరపుకోటలోనే అత్యంత ఆధునీకరణ, అన్ని సదుపాయాలు కలిగిన హాస్పిటల్‌గా సంజీవని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పేరుగాంచింది. ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ సేవలు రూ.2500 మాత్రమే (డాక్టర్ కన్సల్టేషన్ ఫీజుతో కలిపి). ఎమర్జెన్సీ డయాలసిస్ సేవలు 24 గంటలపాటు వైద్యులు, టెక్నీషియన్ పర్యవేక్షణలో వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల ఇన్సూరెన్సు స్కీములపై కూడా వైద్యసేవలు అందించనున్నాం. యూరాలజి, నెఫ్రాలజీ, కార్డియాలజీ, సర్జికల్ అంకాలజీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెటిక్స్, జనరల్ సర్జరీ, ఇఎన్‌టి, పల్మానాలజీ, ఫిజియోథెరపీ తదితర వైద్య సేవలతోపాటు బిపి, షుగర్, థైరాయిడ్ పేషెంట్లను ప్రతి శుక్రవారం ఉచితంగా పరీక్షలు చేయనున్నాం. అత్యవసర సమయంలో ఎమర్జెన్సీ చికిత్స అందించేందుకు ఐసియు, వెంటిలేటర్ సౌకర్యం అందుబాటులో ఉన్నాయి. మా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్ వైద్య సేవలు కూడా అందిస్తున్నాం. స్త్రీల వైద్య నిపుణులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు 24 గంటల వైద్యసేవలతోపాటు యాక్సిడెంట్, అన్ని రకాల మెడికల్ కేసులకు సేవలందిస్తాం. ప్రజలను వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.







మిమ్స్ ఆస్పత్రి

# మిమ్స్.. సేవల్లో భేష్

**ఉత్తరాంధ్రలో వైద్యం, సంబంధిత విద్యను అందించడంలో పేరు సంపాదించుకున్న మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్) స్థాపించి 20ఏళ్లు పూర్తయింది. ఈ ప్రాంతంలో తొలిసారి ఏర్పాటైన ఈ వైద్య విద్యాసంస్థ తమకెవ్వరూ సాటిరారని నిరూపించుకుంటూ ముందుకు సాగుతోంది. 2003 అక్టోబర్‌లో ఉత్తరాంధ్రలో మొట్టమొదటిగా ప్రైవేటు రంగంలో ఏర్పాటైన ఈ కాలేజీలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలతోపాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల ప్రజలకు ఎనలేని వైద్య సేవలను అందిస్తోంది.**

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో అధునాతన సాంకేతిక సదుపాయాలతో వైద్య సేవలు అందుతున్నాయి. ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలిచిన మిమ్స్ జనరల్ ఆసుపత్రికి మన రాష్ట్రంతో పాటు ఒడిస్సా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుంచి కూడా రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా ఒడిస్సా రోగులకు మన రాష్ట్రం లాగా ఆరోగ్య శ్రీ మాదిరిగా శస్త్ర చికిత్సలు, వైద్య సేవలు అందుతున్నాయి. అలాగే ఇంటెన్ కేర్ యూనిట్ బెడ్లు 100, ఆపరేషన్ థియేటర్‌లు 12, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, లేజర్ ట్రీట్మెంట్, హైర్ ట్రాన్స్ ప్లాంటేషన్ వంటి సేవలు అధునాతన పరికరాలతో అందిస్తున్నారు. మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు, ఫిజియోథెరపీ, దంత వైద్యం, ఛాతి ఊపిరితిత్తుల విభాగం, మానసిక వ్యాధులకు చికిత్స, చర్మ, చిన్న పిల్లలకు, స్త్రీ, ప్రసూతి, శస్త్ర చికిత్సలు జనరల్ వైద్య సేవలు అందుతున్నాయి. అదేవిధంగా మూత్ర కోశ వ్యాధి, గుండె జబ్బులు, కిడ్నీ సంబంధి వ్యాధులు, మెదడు నరముల బలహీనత, జీర్ణ కోశ వ్యాధులు, పసి కందులకు నిపుణులైన వైద్యులతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు మిమ్స్ యజామన్యం అందిస్తుంది. కాగా మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో ఉద్యోగులకు ఈహెచ్ఎస్, కార్మికులకు ఈఎస్ఐ, పేద, బలహీన వర్గాలకు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు, కన్నతల్లి పథకం ద్వారా గర్భిణులకు ప్రసూతి వైద్య సేవలు అందుతున్నాయి.

**విశాలమైన వాతావరణంలో వైద్య సేవలు**

మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నెల్లిమర్లలో వైద్య కళాశాలను, జనరల్ ఆస్పత్రిని శ్రీరామా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ అల్లూరి మూర్తిరాజు నెలకొల్పారు. విశాలమైన ప్రాంగణంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతమైన వైద్య పరికరాలతో, నిష్ణాతులైన వైద్య విద్యా బోధకులతో, నిపుణులైన సిబ్బందితో ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. విద్యతోపాటు వైద్య రంగంలోనూ వెనుకబడి ఉన్న జిల్లాకు ఈ విద్యాసంస్థ రావడంతో వైద్య రంగంలో అనేక మార్పులకు దోహదపడింది.




మిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలు

**పెరుగుతున్న బోధకులు, విద్యార్థులు**

100 మంది అధ్యాపకులు, విద్యార్థుతో ప్రారంభమైన ఈ కాలేజీ నేడు ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రముఖ వైద్య కళాశాలల్లో ఒకటిగా పేరు సంపాదించుకుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా బిహెచ్ఎంఎస్ కోర్సును ప్రవేశపెట్టిన సంస్థగా మిమ్స్ ప్రత్యేకతను నిలుపుకుంది. ఇక్కడ ఎంబిబిఎస్‌తోపాటు పిజి పారామెడికల్, ఫిజియోథెరపీ, హోమియోపతి, నర్సింగ్ కాలేజీ, స్కూల్ వంటివి నిర్వహిస్తున్నారు.

**నిరుద్యోగులకు ఉపాధి**

జిల్లా కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య కళాశాల, ఆస్పత్రిలో అనేక మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు. స్థానిక మండలంతో పాటు విజయనగరం నుంచి అనేక మంది ఇక్కడికి వచ్చి వివిధ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. రోజువారీ, నెలసరి వేతనాలకు పలువురు పనిచేస్తున్నారు.

**24 గంటలూ వైద్యసేవలు**

ఈ బోధనాసుపత్రిలో రోజంతా వైద్యులు అందుబాటులో ఉంటారు. అత్యాధునిక పరికరాలతో, నూతనమైన ల్యాబ్‌లతో వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. అతి తక్కువ ఫీజుతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకుంటున్నారు. కార్పొరేట్ల చేతిలో వ్యాపార వస్తువుగా వైద్యం మారిన ఈ కాలంలో సామాన్యులకు సైతం అతి తక్కువ ఫీజుతో సేవలందిస్తోంది.

## అందుబాటులో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, మెడికల్ గాస్ట్రన్‌స్టాలజీ, ఎన్‌టిఆర్, ఆరోగ్య సేవ, ఉద్యోగశ్రీ, ఇఎస్ఐ తదితర బీమా సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఆల్ట్రా సౌండ్, కలర్‌డాప్లర్, అధునాతన ఎక్స్‌రే సదుపాయాలు ఉన్నాయి. అధునాతన సదుపాయాలతో చిన్నపిల్లల విభాగం ఉంది. జాతీయ కార్యక్రమంలో భాగంగా ఉచిత నేత్ర, కుటుంబనియంత్రణా శస్త్రచికిత్సలు చేసి, ప్రభుత్వ పారితోషికం అందిస్తున్నారు. అన్ని వసతులతో కూడిన ఆధునిక లగ్జరీ ప్రైవేటు వార్డులు, 24 గంటల అన్ని గ్రూపుల బ్లడ్‌బ్యాంక్, కాంపోనెంట్స్, మానసిక, ఛాతి, క్షయ రోగ వైద్యులు అందుబాటులో ఉన్నాయి. ఇసిజి, 2డి ఇసిహెచ్ఒ, టిఎంటి, ఇఇజి, ఇఎంజి పరీక్షలు చేస్తున్నారు. అన్ని సదుపాయలతో సంచార వైద్య వాహనాలను కూడా నిర్వహిస్తున్నారు.

# పిజి స్టార్‌లో అధునాతన వైద్యసేవలు

### ఆస్పత్రి ఎమ్‌డి ఎస్‌వి రమణ



**విజయనగరం :** నగరంలోని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అన్ని అధునాత, మౌలిక సౌకర్యాలతో ప్రజలకు వైద్యసేవలను అందిస్తున్న హాస్పటల్ పిజిస్టార్ అని ఆ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌వి రమణ తెలిపారు. జిల్లా ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా సహాయం కోసం తమ ఆస్పత్రి హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే 24గంటలూ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కేన్సర్‌కు సంబంధించి తమ హాస్పటల్‌లో హైదరాబాద్ కేన్సర్ క్లినిక్స్ వారి సౌజన్యంతో అన్ని రకాల కేన్సర్ శస్త్రచికిత్సలు, కీమోథెరపీ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే అత్యవసర సేవలను అన్ని వేళల్లో చూస్తామన్నారు. సర్జికల్, మెడికల్, గైనిక్, పిడియాట్రిక్స్, ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థో, ట్రామా ఇఎన్‌టి, నెఫ్రాలజీ, యురోలజీ, న్యూరోమెడిసన్, న్యూరో సర్జరీ, డయోబెటిక్ క్లినిక్, జిరియాటిక్ క్లినిక్ వంటి వైద్య సేవలందజేస్తున్నట్టు తెలిపారు. తమ ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఇహెచ్‌ఎస్, అన్ని రకాల ఇన్సూరెన్స్ కార్డులపై నగదు రహిత వైద్యం అందజేస్తున్నామని చెప్పారు. ప్రమాదం సంభవించినప్పుడు అత్యవసర చికిత్స కోసం ఐసియు, క్యాజువాల్టీ, 24గంటలు పనిచేసే అధునాతన లేబొరేటరీ, సిటి స్కాన్, యుఎస్ స్కేన్, ఎక్స్‌రే, ఇసిజి, తదితర అన్ని వైద్య సదుపాయాలు తమ అందుతాయన్నారు. పిజిస్టార్‌లో మెరుగైన స్పెషాల్టీ, సూపర్ స్పెషాల్టీ వైద్యసేవలు అందించనున్నట్టు తెలిపారు.

# కార్మికుల ఆరోగ్య సంజీవని ఇఎస్ఐ ఆస్పత్రి

## అందుబాటులో 9 రకాల వైద్య సేవలు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

జిల్లాలో కార్మికులకు ఆరోగ్య సంజీవనిగా జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ ఆసుపత్రి నిలిచింది. జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఆరోగ్య సమస్యలు పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఇఎస్ఐ ఆసుపత్రి కార్మికులు ఆరోగ్య సేవలో అనేక సేవలు అందిస్తుంది. పరిశ్రమలలో పని చేసే కార్మికులు ఆరోగ్యాలను కాపడుకోవాల్సిన బాధ్యత పరిశ్రమలు యాజమాన్యులపై ఉంది. అందుకోసం కార్మికులు వేతనాలు నుంచి నెలవారీ డబ్బులు కూడా కోత పెట్టి ఇఎస్ఐ ఖాతాల్లో వేయడం జరుగుతుంది. కార్మికులు ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ఉన్న ఇఎస్ఐ ఆసుపత్రి జిల్లాలో కార్మికులకు వరంగా మారింది.

ఇఎస్ఐ ఆసుపత్రి ద్వారా కార్మికులకు 9 రకాల సేవలు అందిస్తున్నారు. వాటిలో ప్రధానంగా జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనకాలజి, జనరల్ మెడిసిన్, ఎనస్తేషియా, ఇఎన్‌టి, మేతలైజీ, రేడియాలజీ, పేతాలజి వంటి సేవలు అందిస్తున్నారు. సుమారుగా 99 శాతం ఈ సేవలు మెరుగైన వైద్యం అందుతుంది. ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితిలో విశాఖ పట్నం పంపిస్తున్నారు.

### 23 వేల మందికి ఉపయోగం

జిల్లాలో గరివిడి, నెల్లిమర్ల, పైడిభీమవరం, బొబ్బిలి నుంచి ఎక్కువగా కేసులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 23వేల మంది కార్మికులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు.

### అల్ట్రా స్కానింగ్ పరీక్షలు

ఇఎస్ఐ ఆసుపత్రిలో ఆల్ట్రా స్కానింగ్ పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు, ఎక్సరే కూడా అందుబాటులో ఉన్నాయి. రేడియాలజీ పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయి. కార్మికుల పరీక్షలు కోసం బయటకు వెళ్లాల్సిన పనిలేదు.

### అందుబాటులో 10 మంది వైద్యులు

ఇఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు అందించే వైద్య సేవలు కోసం 10 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరితో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్ ఒకరు, ల్యాబ్ టెక్నీషియన్‌లు ఇద్దరు ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది నైట్ వాచ్మేన్, ఆసుపత్రి నీ శుభ్రం చేసే సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. సరిపడా సిబ్బంది ఉండటం వల్ల రోజుకి 60 వరకు ఒపి అవుతుంది.

### అదనపు భవనాలు అవసరం

ఇఎస్ఐ ఆసుపత్రికి అదనపు భవనాలు అవసరం ఉంది. పాత భవనాలు కావడం వల్ల సరిపడా గదులు చాలడం లేదు. దీంతో ఇరుకు గదుల్లో ఉండాల్సి వస్తుంది. ఇప్పటికే మెడికల్ కాలేజీ పక్కనే కొత్త భవనం నిర్మాణం జరుగుతుంది. అధి పూర్తయితే భవనం సమస్య పరిష్కారం కానుంది.



ఇఎస్ఐ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు

## మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ప్రతి రోజు 60 మందికి తగ్గకుండా ఒపి అవుతుంది. కార్మికులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నా సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

**- డాక్టర్ కృష్ణ కిశోర్,**
**సూపరింటెండెంట్, ఇఎస్ఐ ఆసుపత్రి**

# రోగులకు సకాలంలో వైద్య సేవలు

## సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- సీతంపేట

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి మూడుసార్లు రౌండ్స్‌కి వెళ్తున్నామని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రోగులకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఉద్దేశంతో ఎప్పటికప్పుడు స్వచ్ భారత్‌లో భాగంగా పాసింజర్ కార్యక్రమాలను నిర్వహిస్తూ క్లీన్ అండ్ గ్రీన్ చేస్తున్నాం. ప్రతి రూమ్‌కి ఏసీతో పాటు ఫ్యాన్లు, లైటింగ్స్, మరుగుదొడ్లు, తాగునీరు, రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ ఎంపానల్ మెంట్ సంబంధించి అన్ని విభాగాల ద్వారా రోగులకు వ్యాధులు నయం చేసి గిరిజనులు మన్నలు పొందుతున్నాం. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రసవాలు గతంలో నెలకు 70 ఉంటే ప్రస్తుతం 120 వరకు ఆసుపత్రిలో జరుగుతున్నాయి. సర్జరీలు 40 వరకు నెలకు జరుగుతున్నాయి. రోజుకు ఎక్స్‌రే స్కానింగ్‌లో 40 నుంచి 50 వరకు జరుగుతున్నాయి. ప్రస్తుతం రోజుకు ఓపి 300 వరకు పెరిగింది. ఇక్కడ వైద్య సేవలు సకాలంలో అందడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ఒక సీతంపేట కాకుండా విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుండి భామిని, కొత్తూరు, పాతపట్నం, ఒడిస్సా రాష్ట్రంలో పర్లాకిమిడి, గుణుపూర్, కాశి నగర్ నుంచి కూడా రోగులు తరలి వస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సేవలు అందించడంలో స్థాయి పెరగలేదు. పరికరాలు వైద్యులు లేకపోవడంతో ప్రతి కేసునూ రిఫర్ చేసేవారు. మందులు, సిబ్బంది కొరత వేధిస్తూ ఉండేది. కనీసం డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చి ప్లేలెట్స్ డౌన్ అయినా వెంటనే వేరే ఆస్పత్రికి తరలించేసేవారు. ఇది ఒకప్పుడు మాట.. ఇప్పుడు దానికి భిన్నంగా ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్క కేసును కూడా రిఫర్ చేయడం లేదు. అన్ని టెస్టులనూ ఆస్పత్రి లోనే చేస్తున్నాం ఇప్పుడు అక్కడందని సేవలు అంటూ ఏమీ లేవు.



ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు 19 మంది వైద్యులున్నారు. తాను సూపరిండెంట్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పీరియాడిక్ ఇద్దరు, ఈఎన్‌టి, ఆర్థోపెడిక్, పెథాలజీ వైద్యులను ఉన్నతాధికారుల సలహాతో తెచ్చారు. ఆర్థోపెడిక్ సర్జరీ కోసం ఉపయోగించిన మిషన్‌ను పార్వతిపురం డిసిహెచ్‌ఎతో మాట్లాడి తెచ్చారు. . ఆరోగ్యశ్రీ నగదు ద్వారా రోగులకు అవసరమైన మందులు కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్నారు.

# డెంగీ, మలేరియా నివారణకు కృషి

## మర్రిపాడు పిహెచ్‌సి వైద్యాధికారి సాయిచరణ్

ప్రజాశక్తి- సీతంపేట

డెంగీ, మలేరియా వైరల్ జ్వరాలు నివారణకు కృషి చేస్తున్నామని మండంలోని మర్రిపాడు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయిచరణ్ తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సీజనల్ వ్యాధుల నివారణకు ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామాల్లో నెలకి 26 రోజులు ఇద్దరు డాక్టర్లు షిఫ్ట్ డ్యూటీ మాదిరిగా సేవలందిస్తున్నాం. ఇప్పటికే పాముకాటుకు మిగతా అవసరమైన 64 రకాల మందులను ఆసుపత్రిలో నిల్వలు ఉంచారు. పిహెచ్‌సి పరిధిలోని హైరిస్క్ గ్రామాలను ముందుగా గుర్తించి దోమతెరలు పంపిణీ చేశాం. స్ప్రేయింగ్ ఇంటింటికి దగ్గరుండి పిచికారీ చేయించాం. ఒకవేళ జ్వరం వస్తే ఆ గ్రామం అంతా రక్త పూతలు సేకరించి టెస్టులకు పంపిస్తున్నాం. వెంటనే వైద్య



శిబిరాలు నిర్వహిస్తున్నాం. అలాగే ఫ్రైడే డ్రై డే కార్యక్రమం వైద్య సిబ్బంది ద్వారా విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఆశ్రమ పాఠశాలలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నాం. రానున్న సీజన్‌లో ఇప్పటికే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. గ్రామాల్లో కూడా జ్వరాలు పై అవగాహన కల్పిస్తున్నాం. మునిపెన్నడూ లేని విధంగా నెలకు 16 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ప్రసవాలు ఆస్పత్రిలో జరిగేలా కృషి చేస్తున్నాం. గిరిజన గ్రామాల్లో కుటుంబ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. రోగులకు అందుబాటులో ఉంటున్నాం. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నాం. వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇంటింటికి సిబ్బంది వెళ్లి రోగుల సమాచారం ఎప్పటికప్పుడు తెప్పించుకోని వారికి కావలసిన వైద్యం అందిస్తూ రోగాలు తగ్గుముఖం పట్టించారు.



# వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

## మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్



రానున్నది సీజనల్ వ్యాధుల కాలం కావడంతో వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బగాది జగన్నాథరావు తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మలేరియా, డెంగీ వ్యాధుల బారినపడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మాత, శిశు మరణాల నివారణకు ముందుస్తుగా హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిపట్ల ఎప్పటికప్పుడు అప్రత్తంగా ఉండాలని సిబ్బందికి సూచిస్తున్నాం. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు ప్రోత్సాహిస్తున్నాం. ఏజెన్సీలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. ప్రోటోజోఎ ాకు అనుకూలమైన వాతావరణం ఉండడమే కారణం. ఈనెలను యాంటీ మలేరియా నెలగానూ, జూలైనెలను యాంటీ డెంగీ నెలగా పరిగణించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. మలేరియా వ్యాప్తిని నివారించడానికి ఇప్పటికే స్ప్రేయింగ్ మొదటి దశలో భాగంగా జిల్లాలో మొత్తం 285 గ్రామాల్లోనూ, పాఠశాలలో స్ప్రేయింగ్ చేశాం. అలాగే మలేరియాను మరింతగా నివారించేందుకు రెండో దశ స్ప్రేయింగ్‌ను జూలై 15 నుండి ఆగస్టు 30 వరకు చేసేందుకు నిర్ణయిం చాం. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించాం. ఫ్రైడే, డ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహించి దోమల వ్యాప్తి అరికట్టి మలేరియాను నివారిం చేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంల ద్వారా ఫీవర్ సర్వే చేయిస్తున్నాం. విలేజ్ వెల్నెస్ కేంద్రాల్లో, లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద రాపిడ్ టెస్ట్ నిర్వహించి, మలేరియాగా నిర్ధారణ జరిగితే రాడికల్ ట్రీట్మెంట్ అందిస్తున్నాం. మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలు తమ ఇళ్లలోనూ చుట్టుపక్క, పరిసరాల్లోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. తద్వారా దోమలు వ్యాప్తిని అరికట్టి మలేరియాను నివారించవచ్చు. గిరి శిఖర గ్రామాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్ నిర్వహించి తగిన వైద్యం, మందులు అందిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో దృష్టిని కేంద్రీకరించి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పిహెచ్‌సి పరిధిలో గర్భిణులను ముందు స్తుగానే గుర్తిస్తున్నాం. ఎవరికైనా రక్తహీనత, ఇతర ఇబ్బందులేమైనా ఉన్నట్టయితే వారికి పోషకాహారం అందించేలా చర్యలు తీసుకుంటు న్నాం. హైరిస్కు గర్భిణులను గుర్తించి, వారిని ముందుగానే ఆస్పత్రులకు తరలించే ప్రసవించే వరకూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

# సంతానలేమిపై చింత వద్దు

**ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు వైవి పద్మజ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ వివేక్**



ప్రజాశక్తి - పార్వతీపురం

సంతానలేమితో దంపతులు చింత వదిలి కుటుంబ్ ఐవిఎఫ్ సెంటర్ వైద్య సేవలతో సంతాన సాఫల్యాన్ని పొందవచ్చునని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు వైవి పద్మజ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ యాళ్ల వివేక్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు వారి మాటల్లోనే...

పార్వతీపురంలో మూడు దశాబ్దాలు దాటి జయశ్రీ హాస్పిటల్ ద్వారా గర్భిణులు, సాధారణగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, కంటి చూపు రోగులకు సేవలందించడంలో తాము అందిస్తున్న వైద్య సేవలు పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు చూపిన అభిమానాలకు చాలా సంతోషిస్తున్నాం. 35 ఏళ్ల జయశ్రీ హాస్పటల్ సేవలకు అనుబంధంగా కుటుంబ్ ఐవిఎఫ్ సెంటర్ అంతర్జాతీయ స్థాయి ఆధునిక పరికరాలతో కూడిన ఐవిఎఫ్ లేబ్‌ను మొట్టమొదటిసారిగా తమ కుమారుడు, సంతాన సాఫల్యత వైద్య నిపుణులు డాక్టర్ యాళ్ల ధీరజ్, కోడలు గైనకాలజిస్ట్ డాక్టర్ పి.రాణి రోజా ప్రారంభించారు. ఈ సేవలు మన పార్వతీపురం ప్రాంతంతో పాటు, విశాఖ వరకు కార్పొరేట్‌కు ధీటుగా విస్తరింప చేశాం. మాతృత్వం ఒక చక్కటి వరం. ఇది పొందని వారి మనోవ్యధ వర్ణాతీతం. అందుకని సంతాన సాఫల్యతలో తమ కుమారుడు ధీరజ్, కోడలు రాణి రోజాను వాటిలో స్పెషలిస్టులుగా ఉన్నత చదువులు చదివించి మన ప్రాంత ప్రజలకు ఈ సేవలను అందించాలనే సదుద్దేశంతో కుటుంబ్ ఐవిఎఫ్ సెంటర్‌ను కొత్తగా ప్రారంభించాం. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

# ఐదేళ్లలోపు పిల్లలకు అన్ని రకాల ఆరోగ్య సేవలు

**జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు**

ప్రజాశక్తి కలెక్టరేట్



ఐదేళ్లలోపు పిల్లలకు అన్ని రకాల ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో అమలు చేసి వారికి ఎటువంటి సమస్యలు రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

జిల్లాలో ప్రతి గ్రామంలో గల చిన్నపిల్లల తల్లిదండ్రుల అందరిలోనూ టీకాల ఆవశ్యకతను తెలియజేస్తున్నాం. టీకాలను క్రమం తప్పకుండా వేసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. జిల్లాలో 80206 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉండగా, 1644 మంది నవజాతి శిశువులు ఉన్నారు. ప్రతి బుధ, శనివారాల్లో షెడ్యూల్ ప్రకారం టీకా కార్యక్రమం జరుగుతోంది. టీకా కార్యక్రమం వివరాలను చిన్నపిల్లల తల్లిదండ్రులకు ముందస్తుగానే తెలియజేస్తున్నాం. పుట్టిన పిల్లలకు మొదటి రోజునే బీసీజీ, ఓవిపి, హెపటైటిస్ బి అనే మూడు రకాల టీకాలు వేస్తున్నాం. నవజా శిశువులను ఆశా కార్యకర్తలు గృహ సందర్శన చేసి వారి ఆరోగ్య వివరాలను వైద్యుల దృష్టికి తీసుకెళ్తాం. జిల్లాలో ఈ కేంద్రాలు సామాజిక ఆసుపత్రి జిల్లా ఆసుపత్రి ఏరియా హాస్పిటల్‌లో ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి బరువు తక్కువ, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సి సెంటర్లలో చేర్చి, వారి ఆరోగ్య స్థితిని బట్టి పోషకాహారం అందిస్తున్నాం.

# ప్రాథమిక వైద్యంలో ఆర్ఎంపిలే కీలకం

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ, పట్టణ మురికివాడల్లో ఏ చిన్న అనారోగ్యం వచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది ఆర్ఎంపి వైద్యులేనని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవిరావు తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆర్ఎంపి వైద్యుల పరిస్థితి ప్రజలకు దగ్గర, ప్రభుత్వం గుర్తింపునకు దూరంగా ఉందన్నారు. కరోనా కష్టకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి ప్రాథమిక వైద్య సేవలు అందించారని చెప్పారు. వీరిలో కూడా చాలామంది కోవిడ్‌కు బలై ప్రాణాలు విడిచారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వీరి సేవలు గుర్తించాలన్నారు. ఆనాడు ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి 2008లో కమ్యూనిటీ పారా మెడిక్‌గా గుర్తించి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శిక్షణ ఇప్పించారని గుర్తుచేశారు. వారందరికీ తక్షణమే పరీక్ష పెట్టి ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు.

# అత్యాధునిక సదుపాయాలతో సాయి సహస్ర ఆస్పత్రి

**చిన్నపిల్లల వైద్య నిపుణులు వాసుదేవరావు**





ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో అత్యాధునిక వైద్య పరికరాలు, 30 పడకలతో శ్రీ సాయి సహస్ర తల్లి పిల్లల ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చిన్నపిల్లల వైద్యనిపుణులు గుంట్రెడ్డి వాసుదేవరావు, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీ రేఖ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడారు. విశేషాలు వారి మాటల్లోనే..

సాధారణంగా చిన్నపిల్లలకు పచ్చకామెర్లు సమస్యను నియంత్రించేందుకు ఫోటో థెరపీ ట్రీట్మెంట్ అందించాల్సిన అవసరం ఉంటుంది. నవజాత శిశువులకు నిర్ధిష్ట ఉష్ణోగ్రతలు అవసరం ఉంటుంది. దీనికోసం వార్నర్ సదుపాయం అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నాం. స్కూల్ పిల్లలు, చిన్నపిల్లలకు, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాక్సిన్స్ ముందస్తుగానే వేస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకుంటూ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉండాలి. పిల్లల్లో ఎలాంటి తేడా ఉన్న వెంటనే డాక్టర్లను సంప్రదించాలి.

**గర్భిణులకు తనిఖీలు తప్పనిసరి**

నెలసరి రాని స్త్రీలు స్త్రీ వైద్య నిపుణులను సంప్రదించిఅవసరమైన తనిఖీలను చేయించుకోవాలని స్త్రీవైద్య నిపుణులు శ్రీరేఖ తెలిపారు. ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయిన తరువాత నెలకు ఒకసారి తనిఖీలు చేసుకోవడం తప్పనిసరి.అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లో డెలివరీ లను నిర్వహిస్తున్నాం.

# శిశువుకు వెయ్యి రోజులు అతి ముఖ్యం

**చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజీవ్**



ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జన్మించబోయే శిశువు సంరక్షణలో వెయ్యి రోజుల వరకు తల్లిదండ్రులు అతి ప్రాముఖ్యత వహించాలని చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రాజీవ్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు వివరాలు మరిన్ని ఆయన మాటల్లోనే...

తల్లి గర్భం ధరించినప్పటి నుండి పిల్లలకు రెండేళ్లు పూర్తయ్యే వరకు సంరక్షణలో అత్యంత ప్రాముఖ్యత వహించాలి. 270 రోజులు అంటే 9 నెలలు గర్భం నుంచి బయటపడిన శిశువు మొదటి 365 రోజులు, మరో 365 రోజులు కలిపి మొత్తం వెయ్యి రోజులు శిశువు పెంపకంలో అత్యంత ప్రాధాన్యత రోజులుగా భావించాలి. పిండం దశ నుండి నవజాతి శిశువు వరకు మొదటి తొమ్మిది నెలల్లో అవయవాలు సక్రమంగా రూపు దాల్చుకొనేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన శిశువు గుండె కొట్టుకోవాలి. లేకుంటే 30 సెకండ్ల లోపే చిన్నపిల్లల వైద్యులు, నర్సులు (ఎన్ఆర్‌పి తర్ఫీదు పొంది ఉన్న వారు) శ్వాస గుండె కొట్టుకునేలా చేస్తారు. శిశువుకి మొదట ఆరు నెలలు విధిగా తల్లిపాలు ఇవ్వాలి. ఆ తర్వాత తల్లిపాలుతో పాటు అనుబంధ పోషకాహారం రెండేళ్ల వరకు తప్పనిసరిగా పిల్లలకు అందించాలి. పిల్లలకు మొబైల్ ఫోను రెండేళ్ల వరకు దరిదాపు ఉంచకూడదు. మొబైల్ వాడకం వల్ల పిల్లల్లో మానసిక, శారీరక అనారోగ్యానికి గురవుతారు. డిప్రెషన్, చిరాకు, కోపం, వ్యక్తిత్వ లోపం, శారీరక బలహీనత, బ్రెయిన్ ట్యూమర్, డ్రై ఐ వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎదుగుతున్న పిల్లల సమాజానికి ఎదిగిన తల్లిదండ్రులే మార్గదర్శకులు కావాలి. అందుకు మనం మారి, వారిని మార్చాలన్న ఆశయంతో పిల్లల తల్లిదండ్రులు ఆలోచించి జీవించాలి. ఈ సమస్యలు జఠిలమైన చిన్నపిల్లల వైద్యునితో సంప్రదించి, కౌన్సిలింగ్ చేసి, వైద్య చికిత్స చేయించుకోవాలి.

# సేవలు భేష్... సౌకర్యాలు తుష్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ డివిజన్‌ల్లోని రోగులకు జిల్లా కేంద్ర ఆసుపత్రి పెద్దదిక్కుగా నిలుస్తోంది. ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు వైద్య సేవలు అందించడంలో విశేష కృషి చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు, రివార్డులు పొంది నెంబర్ 1 ర్యాంకు గుర్తింపు పొందింది. అయితే అసుపత్రి అవసరాలకు తగ్గట్టుగా గుండె, నరాలు, కేన్సర్ తదితర విభాగాలకు సంబంధించిన స్పెషలిస్టులు లేకపోవడంతో ఇంకా గిరిజనులు రెండు జిల్లాను దాటుకుంటూ విశాఖ కెజిహెచ్‌తో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడం తప్పడం లేదు. ప్రభుత్వం గిరిజనుల వైద్యంపై శ్రద్ధపెట్టి అభివృద్ధి చేయగలిగితే రిఫరల్ కేసులు గణనీయంగా తగ్గించవచ్చు. 2021లో ఏరియా ఆస్పత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రి స్థాయి గుర్తింపుతో ప్రభుత్వ అనుమతులు ఇచ్చింది. అప్పటి నుంచి వంద పడకల నుండి 150 పడకల స్థాయికి పెరిగింది. దీనికి అనుగుణంగా అదనపు సౌకర్యాల కోసం పలుభవనాలు మంజూరైన ప్పటికీ, పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకపో వడంతో భవనాలు చాలక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 18 మంది వైద్యులు, 47 మంది వైద్య సిబ్బంది, వైద్యేతర సిబ్బందితో కలిపి మొత్తం 118మంది ఉన్నారు. ప్రస్తుతం నెలకు సగటున 15వేల మందికి పైగా ఔట్ పేషెంట్లు, 2వేల మంది వరకు ఇన్‌పేషెంట్లు వైద్యసేవలు పొందుత న్నారు. 2022-23కు గానూ ఓపి163090, ఇన్‌పేషంట్లు 24981, రోగులు సేవలు అందుకోగా, 2వేలకు పైగా మేజర్ అపరేషన్‌లు నిర్వహించారు. 3227 కాన్పులు జరిగాయి. 6578 మంది గర్భిణీకుల అల్ట్రా సౌండ్‌పరీక్షలు నిర్వహించగా, 316931 మందికి లేబొరేటరీ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాదిలో 14770 ఎక్స్‌రేలు తీయగా, 10931మందికి ఈసిజి చేశారు. డెంగీకు సంబంధించిన ప్లేట్ లెట్స్‌తో పాటు సిఆర్‌పి, సిబిపితో పాటు పలు రకాల రక్త పరీక్షలు ఇక్కడ చేస్తున్నారు. డెంగీ పరీక్షించి నిర్ధారణ చేసే అధికారం కేవలం జిల్లా కేంద్రాస్పత్రికి మాత్రమే ఉంది. ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో 200 యూనిట్ల వరకు రిజర్వ్‌లో ఉంచడంతో పాటు రక్తం కొరత ఉన్న రోగులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రం ద్వారా 12 బెడ్లతో డెలివరీ అయ్యే బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా గర్భిణులకు వైద్య సేవలు అందుతున్నాయి. అనుబంధ పోషణ కేంద్రాల ద్వారా తల్లీపిల్లలకు 10 బెడ్లు ఉన్నాయి. ప్రత్యేకంగా వీరికోసం ఆసుపత్రి ఆవరణలోనే నూతన భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది. రక్తహీనత గల గర్భిణీలను గుర్తించి వారికి బరువు, రక్తం శాతం మెరుగుపర్చే పౌష్టికాహారంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు.

ఇదీ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర ఆస్పత్రి పరిస్థితి




కిడ్నీ రోగులకు అత్యుత్తమ సేవలు జిల్లా కేంద్రాస్పత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయి. డయాలసిస్ విభాగం ద్వారా అనేక మంది కిడ్నీ రోగులకు డికె సెంటర్ ద్వారా తలసేమియా సికిల్ సెల్ ఎనీమియాకు చికిత్స అందిస్తూ ప్రతి నెలా అవసరమైన రక్తాన్ని అందిస్తున్నారు. డిఇఐసి ద్వారా పుట్టిన పిల్లలకు అవయవ లోపాలు పరీక్షించే అధునాతన టెక్నాలజీతో అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ఎఆర్‌పి సెంటర్ ద్వారా కూడా హెచ్‌ఐవి రోగులకు తనిఖీలో వారి స్థితిగతులను బట్టి 420మంది వరకు ప్రతినెలా మందులు అందిస్తూ వైద్య సేవలందిస్తున్నాం. వీటితో పాటు ఎక్స్‌రే, సిటిస్కాన్ కూడా ఉండడం ద్వారా మెరుగైన వైద్య సేవలకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కేంద్ర ఆసుపత్రికి వర్తింప చేయడం వల్ల నార్మల్ డెలివరీకి రూ.5వేలు, సిజేరియన్ డెలివరీకి రూ.3వేలు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వ అందిం చడంతో డెలివరీ కేసులు కూడా చాలావరకు పెరిగాయి. జనరల్ ఆపరేషన్లు చేయించుకున్న రోగులకు కూడా ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో ఉన్న ఒక వైద్యుడు సదరం బాధ్యతలు చూడడం వల్ల, ఇంకో ఆర్థో వైద్యుని పోస్టు ఖాళీగా ఉండడం వల్ల రోగులకు సంతృప్తికర సేవలు అందించలేకపోతున్నారు. గైనిక్ ఐదుగురు వైద్యులకు గాను ముగ్గురే ఉన్నారు, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్య నిపుణుల కొరతను భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాలోని గిరిజనుల వైద్య సేవల అవసరాన్ని గుర్తించగలిగి, జిల్లా ఆసుపత్రిలో డిమాండ్ మేరకు వైద్యులను భర్తీచేయడంతో పాటు, జిల్లాకు కేటాయించబడిన సూపర్ స్పెషాలిటీ అసుపత్రి అందుబాటులోకి తీసుకురాగలిగితే రోగులు వ్యయ ప్రయాసలు భరించి దూరప్రాంతాలకు తరలివెళ్లే బాధ తప్పుతుందని భావిస్తున్నారు.

# గిరిజనులకు అందుబాటులో వైద్యసేవలు

## ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ వెంకటరమణ



ప్రజాశక్తి కలెక్టరేట్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజనులందరికీ వైద్య ఆరోగ్య సేవలన్నీ అందు బాటులో ఉంచుతున్నామని, కావున వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ వెంకటరమణ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే అంతరాయం లేకుండా నిరంతరం అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నాం. వీటిపై ఎప్పటికప్పుడు గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నాం. మాతృ మరణాల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుకల్లు, పాచిపెంట పిహెచ్‌సిలకు ఐటిడిఎ ఎమర్జెన్సీ అంబులెన్స్ అందుబాటులో ఉంచాం. అత్యవసర సమయంలో ఎటువంటి ఇబ్బం దుల్లేకుండా అంబులెన్స్ సదుపాయం అన్నివేళలా అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఏజెన్సీలో మలేరియా నివారణకు మొదటి దశ స్ప్రేయింగ్లో సబ్ ప్లాన్ మండలాల్లోని అన్ని స్కూళ్లు, కాలేజీలు, ఇండోర్ రెసి డ్యూ స్ప్రేయింగ్ చేయించాం. అలాగే జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో గిరిజన రోగుల అవసరాలు కోసం రవాణా, బ్లడ్, పేషెంట్ల వైద్య సదుపాయాల అవగాహనకు గిరిజన సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఆరోగ్య శాఖలో ఎటువంటి ఇబ్బంది, సమస్యలు తలెత్తకుండా ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా భావించి 24 గంటలు వైద్యులు, సిబ్బంది నిరంతరం గిరిజనులకు వైద్య ఆరోగ్య ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కషి చేస్తున్నాం.

# వ్యాధులు రాకుండా అప్రమత్తం

## చిన్నపిల్లల వైద్య నిపుణులు జె.రవీంద్రకుమార్



ప్రజాశక్తి-పాలకొండ

వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లల వైద్యాధికారి జె.రవీంద్రకుమార్ అన్నారు. 'ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

చిన్న పిల్లలకు పోషక విలువలు పెంపొందించే ఆహారం ఇవ్వాలని, తల్లిపాలు అందించాలి. ముఖ్యంగా వర్షాకాలంలో తరచూ వ్యాధులు సంభవించే పరిస్థితి ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. దగ్గు, జలుబు, జ్వరం ఎక్కువగా వస్తాయి. కావున వేడినీరు తాగించాలి. వేడి ఆహార పదార్థాలే ఇవ్వాలి. మిటమిన్లు, ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని అందించాలి. పిల్లలకు ఎటువంటి అనారోగ్యం ఉన్నా సొంత వైద్యం చేయకుండా దగ్గరలో ఉన్న వైద్యాధికారిని సంప్రదించాలన్నారు.

# వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవాలి

## వైద్యులు తులసీదాస్

ప్రజాశక్తి-పాలకొండ రూరల్



ప్రతి ఒక్కరూ వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవాలని వైద్యులు కె.తులసీదాస్ అన్నారు. ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే... వ్యాధి నిరోధకశక్తి పెంపొందించుకుంటే వ్యాధులు దరిచేరవు. అందుకు అవరమున్న పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. రోజుకు 5 లీటర్ల నీటిని తాగాలి. నీటి ద్వారా అనేక వ్యాధులు నిరోధించవచ్చు. అలాగే పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. కల్తీ, నాసిరకమైన ఆహారం తీసుకోకూడదు. స్వచ్ఛమైన ఆహారాన్ని తీసుకోవాలి. అటువంటి ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా ఆకుకూరలు, పప్పుదినుసులు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ వైద్య సేవలు

**గురుగుబిల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు ప్రియాంక, కెకె సాగర్ వర్మ**

ప్రజాశక్తి - గరుగుబిల్లి




స్థానిక పిహెచ్‌సిలో సెమీ ఆటో ఎన్లైజర్ మిషన్ ద్వారా 30 రకాల రోగాల నిర్ధారణ పరీక్షలు కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ వైద్య సేవలు అందజేస్తున్నామని వైద్యాధికారులు డాక్టర్ పిఎ ప్రియాంక, కెకె సాగర్ వర్మలు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు వారి మాటల్లోనే...

రోజువారీ ఒపిలో 70కి పైగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం కల్పించిన సెమీ ఆటో ఎనలైజర్ మిషన్ ద్వారా మూడు రకాల కొలెస్ట్రాలు, ఐదు రకాల లివర్ పరీక్షలు, మూడు రకాల కిడ్నీ పరీక్షలతో పాటు రక్త పరీక్షలు వంటి వివిధ 30 రకాల పరీక్షలను రోగులకు అందించడమేకాకుండా యూరిన్ ఫ్లోరోసెంట్ మిషన్ ద్వారా నాలుగు రకాల పరీక్షలు, మైక్రోస్కోప్ ద్వారా మూడు నుండి నాలుగు వరకు టిబి పాజిటివ్ రోగులను గుర్తించి వైద్య సేవలు చేయడం జరుగుతుంది. గరుగుబిల్లి మండల ప్రజలకు ఇది ఒక వరం. ఏడాదికి పదిమందికి ఆసుపత్రిలో డెలివరీ కేసులను ప్రభుత్వ లక్ష్యాలు ఇవ్వగా నెలవారీ రెండు నుండి మూడు వరకు నార్మల్, సిజరిన్ కాన్పులను జరిపించాం. ఏడాదిలో లక్ష్యానికి మించి ఆసుపత్రిలో కాన్పులయ్యేలా కృషికి సంతృప్తినిస్తోందన్నారు. ప్రభుత్వ బడ్జెట్ విడుదల ఆలస్యం కారణంగా మందుల కొరత ఉన్నప్పటికీ అత్యవసర ఎవిఎస్ వ్యాక్సిన్స్, ఎవిఆర్ వ్యాక్సిన్స్, ఆసుపత్రిలో నిరంతరాయంగా అందుబాటులో ఉంచుతున్నాం.

# గిరిజనులకు వైద్య సేవలతో సంతృప్తి

**డాక్టర్ జి.గిరీష**

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్



కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన ఆరోగ్య సం రక్షణలో గిరిజన రోగు లకు వైద్య సేవలు చేయ డం తనకు ఎంతో సంతృప్తిగా ఉందని సీతం పేట ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.గిరీష అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. . వివరాలు ఆమె మాటల్లోనే...

ప్రజల ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రతతో ఆధారపడి ఉంది. అందుకు ప్రభుత్వాలు డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గిరిజన ప్రాంతంలో కాలువల్లో మురికి నిల్వ ఉండడంతో మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలకు గురవుతారు. అందుకు ముందస్తుగానే దోమతెరలు పంపిణీ, మలాథియిన్ స్ప్రే చేయడం వంటివి చేపడుతున్నాం. పిల్లలకైనా, పెద్దలకైనా ఏ చిన్న అనారోగ్యం బారినపడ్డా అందుబాటులో ఉంటున్నాం. కావున ప్రభుత్వ వైద్య సేవలు గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# అన్ని వైద్య పరీక్షలకూ కేరాఫ్ 'మాన్యశ్రీ' ఆరం

**డాక్టర్ విజయ కిశోర్**

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



జిల్లా కేంద్రంలో అన్ని వైద్య పరీక్షలు డాక్టర్ సమక్షంలో నిర్వహించే మొట్టమొదటి డయోగ్నిస్టిక్ కేంద్రం మాన్యశ్రీ డియోగ్నిస్టిక్ అని డాక్టర్ విజయ కిషోర్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

సుదూర ప్రాంతాలైన విజయనగరం, విశాఖ వంటి నగరాలకు రోగులను అష్ట కష్టాలతో వైద్య పరీక్షల నిమిత్తం తీసుకువెళ్లడం జరిగేది. మొట్టమొదటిసారిగా మాన్యశ్రీ డయోగ్నిస్టిక్ జిల్లా కేంద్రంలోని ఏర్పాటైన తర్వాత టిఫా స్కాన్, కలర్ స్కాన్, అన్ని రకాల ఆల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చాం. వీటితో పాటు రిపోర్ట్‌తో కూడిన డిజిటల్ ఎక్స్‌రే కూడా ఏర్పాటు చేశాం. పూర్తిగా కంప్యూటరీకరించబడిన ఆటోమేటిక్ లేబొరేటరీతో రక్త పరీక్షలు, ఇసిజి సూది పరీక్ష సదుపాయం అందించాం. ఇవన్నీ టెక్నీషియన్లతో పాటు, డాక్టర్ నా ఆధ్వర్యంలో నిర్వహించడమనేది ఒక్క మాన్యశ్రీ డయోగ్నిస్టిక్ కి మాత్రమే సాధ్యపడుతుంది. ఈ విషయంలో రోగులు వైద్య పరీక్ష సేవలకు సంతృప్తి చెందడం చాలా సంతోషంగా ఉంది.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

**డాక్టర్ సిహెచ్ సూర్యనారాయణ**

ప్రజాశక్తి-విజయనగరం



సీజనల్ వ్యాధులు, జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు, సివిల్ సర్జన్ డాక్టర్ చుక్క సూర్యనారాయణ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రస్తుతం వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు వేడి నీటిని తాగితే మంచిది. బయట ఆహారం తినకూడదు. ఇంట్లో వేడిగా వండుకొని తినడం చాలా మంచిది. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకూడదు. బ్లీచింగ్ జల్లుకోవడం, శుభ్రంగా ఉంచుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. మరోవైపు కోవిడ్ అనంతరం కూడా పలు సమస్యలు వస్తున్నాయి. వాటి పట్ల జాగ్రత్తలు అవసరం. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి తగు వైద్యం చేయించుకోవాలి.

# జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధులు దూరం

**ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ జె.శ్రీకాంత్**

ప్రజాశక్తి- విజయనగరం



కిడ్నీల్లో రాళ్లు అనేవి ఎక్కువగా వేసవిలో వేడి వల్ల నీరు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల రాళ్లు ఏర్పడాయని, అలాగే వంశపార పర్యం కూడా 25శాతం మందికి రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ జె.శ్రీకాంత్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

కిడ్నీల్లో రాళ్లు ఏర్పడిన వ్యక్తి పక్కటెముకల్లో నొప్పి ఏర్పడిన అనంతరం కడుపునొప్పి ఎక్కువగా వస్తుంది. వాంతులు, యూరిన్ మంట, యూరినల్‌లో రక్తం వంటి లక్షణాలు కలుగుతాయి. కిడ్నీలో రాయి తయారై యూరినల్‌లో రాయి ఇరుక్కున్నప్పుడు ఈ వ్యాధి తీవ్రత పెరుగుతుంది. రాళ్లుఎంత పరిమాణంలో ఉన్నాయన్న విషయాలు తెలుసుకో నేందుకు సంబం ధిత వ్యాధి నిపుణులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. ఆ రాళ్లు చిన్నగా ఉన్నప్పుడు నీళ్లు ఎక్కువగా తాగడం, మందులను వినియోగిస్తే నివారించుకోవచ్చే. అదే రాళ్లు పరిమాణం పెరిగి యూరినల్‌కు అడ్డుపడినప్పుడు, కిడ్నీ వాపుఉన్నప్పుడు, జ్వరం, వాంతులు వచ్చినప్పుడు రాళు తీసుకొనే ప్రయత్నం చేయాలి. ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ఆపరేషన్ లేకుండా ట్యూబ్ ద్వారా ఆ రాళ్లను తొలగించే అవకాశాలు ఉన్నాయి. వీటిని రోగులు వినియోగించుకోవచ్చును.



# సెల్‌ఫోన్లు వరమా? శాపమా?

**డాక్టర్ మహ్మద్ అజజుర్ రెహమాన్, డాక్టర్ ఎమ్‌డి ఫైసాల్**



ప్రజాశక్తి-విజయనగరం

నేడు సెల్‌ఫోన్ రహిత జీవితం గడపడం అసాధ్యంగా మారింది. ముఖ్యంగా కరోనా నేపథ్యంలో చంటి పిల్లలు కూడా ఆన్‌లైన్ క్లాసులు అనే పేరుతో దీనికి బానిసలుగా మారారు. సెల్‌ఫోన్‌లో 20 నిముషాలు మాట్లాడితే ప్రతి 20 నిముషాలకు చెవి యొక్క ఉష్ణోగ్రత ఒక సెంటీగ్రేడ్ పెరుగుతుంది. ఇది కొనసాగితే చెవిలో శబ్దాలు రావడం 'టెనిటస్' అనేది ఏర్పడుతుంది. రాను రాను వినికిడి లోపంతో పాటు చేతి తాలూకా ట్యూమర్స్ ఏర్పడతాయి.

**మెదడుకు కలిగే ప్రమాదాలు**

ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం ప్రతి వంద గంటలకు 'మెనిన్‌జిమియా' అనే కేన్సర్ ప్రమాదం 26శాతం పెరుగుతోంది. పదేళ్ల పాటు వాడితో 'గ్లయోమా' అనే క్యాన్సర్ వచ్చే ప్రమాదం 55.90శాతం పెరుగుతుంది. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ అనే క్యాన్సర్ (ఎఎఆర్‌సి) సెల్‌ఫోన్లను పాసిబుల్ హ్యూమన్ కార్సినోజన్‌గా పరిగణించారు.

**కళ్లకు కలిగే ప్రమాదాలు**

సెల్‌ఫోన్‌ను ఎక్కువగా చూడడం వల్ల కంటి తాలూకా క్యాన్సర్ వచ్చే అవకాశం వృద్ధి చెందుతుంది. మన కంటిలో ఉండే లెన్సుకు దృష్టి పెట్టే సమర్ధత తగ్గిపోతుంది.

**పిల్లలకు కలిగే ప్రమాదాలు**

పిల్లలకు కపాలం చిన్నగా, సన్నగా ఉండటం వల్ల మైలిన్ షిట్ అనే పొర మెదడు చుట్టూ ఉంటుంది. ఇది మెదడును కాపాడుతుంది. ఇది పిల్లల్లో పూర్తిగా వృద్ధి చెందదు కాబట్టి సెల్‌ఫోన్ హాని వీరిపై ఎక్కువగా ఉంటుంది. ఆటిజమ్ అనే వ్యాధి సెల్‌ఫోన్ వాడే పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

**సంతానంపై ప్రభావం**

సెల్‌ఫోన్ వాడకం వల్ల స్పెర్మ్ సంఖ్య తగ్గడంతో పాటు స్పెర్మ్‌కి నష్టం కలుగుతుంది. సెల్‌ఫోన్ వాడకం వల్ల ఎలక్ట్రా స్మాగ్ అనే ఒక రకమైన పొగ వంటిది రక్తకణాలపై ఏర్పడుతుంది. దాని ఫలితంగా రక్త ప్రసరణ తగ్గుతుంది. ఆక్సిజన్ రవాణా కూడా తగ్గిపోతుంది. డిఎన్ఎకి నష్టం కలుగుతుంది. దీని వల్ల తరువాత తరంపై కూడా ప్రభావం కనిపిస్తుంది.

- సెల్‌ఫోన్ వాడ కం గర్భిణులకు, లోపల బిడ్డకు కూడా ప్రమాదం. సెల్‌ఫోన్ అధిక వాడకం వల్ల అల్జీమర్స్, పార్కిన్ సన్ వ్యాధి వచ్చే అవకాశం పెరుగుతుంది. నిద్రలేమి, తలనొప్పి, తొందరగా అలసిపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం వంటివి జరగవచ్చు.

# ఆధునిక పరికరాలతో సన్‌షైన్ ఆర్థోఫిట్ సేవలు

## ఆర్థోఫిట్ వైద్య నిపుణులు శ్రావణ్ కుమార్



ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ఒకప్పుడు క్రిటికల్ ఆర్థోఫిట్ ఆపరేషన్ కొరకు సుదీర్ఘ ప్రాంతాలైన విశాఖ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని ఇప్పుడు మన్యం జిల్లా కేంద్రంలోనే అత్యాధునిక పరికరాలతో సన్ షైన్ ఆర్థోఫిట్ చిల్డ్రన్స్ కేర్‌లో సేవలందించగలుగుతున్నామని ఆర్థోఫిట్ వైద్యనిపుణులు డాక్టర్ జి శ్రావణ్ కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

పార్వతీపురం బైపాస్ రోడ్డులో సన్ సైన్ ఆర్థో, చిల్డ్రన్స్ కేర్ హాస్పిటల్లో సి -ఆర్ ఎం ఎక్స్‌రే ద్వారా ఎముకలు, కీళ్ల రోగులకు వైద్య సేవలు అందిస్తున్న ఏకైక హాస్పల్‌గా గుర్తింపు పొందింది. కీళ్ల నొప్పులకు, ఎముకలు విరిగినప్పుడు సాధారణంగా పెయిన్ బామలు రాయడం, ఆయిల్తో రుద్దడం, నాటుకట్లు వల్ల రోగులకు నష్టాలే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. 40 ఏళ్లు దాటిన మహిళల్లో నడుము నొప్పి సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కుటుంబ నియంత్రణలో భాగంగా గర్భసంచి తొలగించిన తర్వాత స్త్రీల్లో హార్మోన్ సమతుల్యం తగ్గడం, కాల్షియం శాతం తగ్గడం వల్ల ప్రభావం చూపుతుంది. ఈ సమస్య నుంచి బయట పడేందుకు రోజు ఖర్జూరం, ఆకుకూరలు తీసుకోని ప్రతిరోజు ఉదయాన్నే సూర్యోదయం సమయంలో ఎండలో ఉండడం ద్వారా శరీరానికి కావాల్సిన విటమిన్ డి లభిస్తుంది. 40 ఏళ్లు పైబడిన వారిలో తరచూ మోకాళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. సాధారణంగా వచ్చే కీళ్ల నొప్పులకు మందులు, దానికి తగ్గ ఆహారం తీసుకోవడం ద్వారా తగ్గించుకోవచ్చు. ఇక రెండో రకం దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు వీటి వైద్యపరీక్షలు నిర్వహించి కారణం విశ్లేషించి మందుల వాడడంతో నొప్పులను నియంత్రించగలం. ప్రమాదవశాత్తు ఎముకలు విరిగి గాయాలైనప్పుడు గాయం తగిలిన భాగాన్ని ఎత్తులో పెట్టి ఐసు ముక్కలు పెట్టి రక్తస్రావం జరగకుండా గుడ్డతో గట్టిగా కట్టి వైద్యుని వద్దకు వీలైనంత త్వరగా తీసుకొని పోయి చికిత్స అందేలా చూడాలి.

## పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ స్నిగ్ధ



ఈ సీజన్ ప్రారంభం నుండే చిన్నపిల్లలపై అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ స్నిగ్ధ అన్నారు. చిన్నపిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని అందుకు పౌష్టికాహారం అందిస్తూ, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పిల్లలను వ్యాధిల బారి నుండి తప్పించగలుగుతామన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు వచ్చే పచ్చకామెర్ల సమస్యలను నియంత్రించేందుకు ఫోటోథెరపీ ట్రీట్మెంట్‌ను అందించాల్సి ఉంటుందన్నారు. నవజాతి శిశువులకు నిర్దిష్ట ఉష్ణోగ్రతల గల వాతావరణం అవసరం. దీనికోసం వార్నర్ సదుపాయం సన్‌షైన్ ఆర్థో అండ్ చిల్డ్రన్ కేర్ హాస్పిటల్ ద్వారా అందుబాటులో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పిల్లలున్న చోట విరోచనాలు, డయేరియాకి గురైన వారిలో నీటి శాతం తగ్గిపోయి ప్రమాదానికి గురికాకుండా ఒఆర్ఎస్ఎల్ ద్రావణాన్ని ఇచ్చి డీహైడ్రేషన్ కాకుండా జాగ్రత్త పడాలన్నారు.

# డాక్టర్ నంగిరెడ్డి ఆశయాలతో వైద్యసేవలు

## అంబికా హాస్పిటల్ నిర్వాహకులు మోహనరావు



ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కీర్తిశేషులు డాక్టర్ నంగిరెడ్డి శ్రీరామ్మూర్తి ఆశీస్సులతో ఆయన ఆశయాలకు అనుగుణంగా వైద్యసేవలు అందిస్తున్నామని అంబికా ఆస్పత్రి నిర్వాహకులు మూడడ్ల జగన్మోహనరావు తెలిపారు. అంబికా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పిఎస్‌పి తేజ, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ రెడ్డి శంకర్రావు, డాక్టర్ బాలాజీ చౌదరి వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మూడు దశాబ్దాలుగా డాక్టర్ శ్రీరామ్మూర్తి వైద్య సేవలు అందించిన ఆస్పత్రిలో సేవలు అందించడం ఆనందంగా ఉంది. జనరల్ వైద్య సేవలతో పాటు సుగర్ వ్యాధి (డయాబెటిస్), బిపి, అధిక కొలెస్ట్రాల్ వ్యాధులతో సతమతమవుతున్న వారికి ఇక్కడ ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి సరైన వైద్య సేవలు అందిస్తున్నాం. వీటితోపాటు విష జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, వాంతులు, విరోచనాలు, పచ్చకామెర్లు, ఫైల్స్, జలుబు, దగ్గు, ఆయాసం, న్యూమోనియా మొదలగు ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధులు, చర్మ సంబంధ వ్యాధులకు వైద్య సేవలు అందించడమే కాకుండా చిన్నపిల్లల వ్యాధులకు ప్రైమరీ కేర్, సలహాలు కూడా ఇస్తున్నాం.హాస్పిటల్ లో షుగర్ స్పెషలిస్ట్, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శ్యామ్ కుమార్ ప్రతిరోజు అందుబాటులో ఉంటారు. మెదడు వెన్నుముక నరాల వైద్య నిపుణులు డాక్టర్ రెడ్డి శంకర్రావు వారంలో బుధ, శుక్రవారం లలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటారు. ప్రతినెల మూడవ బుధవారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ బాలాజీ చౌదరి కూడా అందుబాటులో ఉంటారు. ఆస్పత్రిలోని డయోగ్నోస్టిక్ సెంటర్‌లో పలు వైద్య పరీక్షలతో పాటు స్పెషల్ ప్యాకేజి అవకాశాన్ని కూడా కల్పిస్తున్నాం.

# ఫ్యామిలీ డాక్టర్‌తో విస్తృత సేవలు

## బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారులు తిరుమల ప్రసాద్, శ్రీకాంత్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ వైద్యుడు (ఫ్యామిలీ ఫిజీషియన్) కార్యక్రమం ద్వారా గ్రామీణులకు విస్తృతంగా వైద్యసేవలందిస్తున్నామని మండలంలోని బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారులు ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, పి.శ్రీకాంత్ అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. పిహెచ్‌సిల్లో వైద్యసేవలందిస్తూనే ప్రత్యేక కార్యాచరణ ద్వారా ప్రతిరోజు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాలకు ఎంతో ఆదరణ లభిస్తుంది. గ్రామాల్లో రోగులను పరిశీలించి, వారికి అక్కడికక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి, రోగనిర్ధారణ జరిగిన వెంటనే ఉచితంగా మందులు అందిస్తున్నాం. అంతేకాక దీర్ఘకాలంగా రోగంతో బాధపడి మంచాన పడివారి ఇళ్లను సందర్శించి వారికి వైద్యసేవలు అందిస్తున్నాం.

అలాగే ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. దీనివల్ల రక్తహీనత పిల్లలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించడం జరుగుతుంది.

# పెరుగుతున్న నరాల బలహీనత కేసులు

## న్యూరాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ చిన్నారావు



ప్రజాశక్తి- విజయనగరం

కోవిడ్ పాజిటివ్ బారిన పడిన వారిలో ఎక్కువగా వివిధ రకాల నరాలు బలహీనతలు బయట పడుతున్నాయని ప్రముఖ న్యూరాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ చిన్నారావు తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. కోవిడ్ చికిత్సలో స్టెరాయిడ్స్ వాడకం అధికంగా ఉండడం వల్ల నరాల బలహీనతలు, కండరాల వాపులు, నొప్పులు, నీరసం ఎక్కువగా ఉండడం, పక్షవాతం కూడా వస్తున్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా సుగర్ వ్యాధిగ్రస్తు లపై దీని ప్రభావం అధికంగా ఉంద న్నారు. కొన్నేళ్లలో సుగర్ వ్యాధి వస్తుందను కునే వారి లో కూడా కోవిడ్ రావడం వల్ల వెం టనే సుగర్ బారిన పడుతున్నారని తెలిపారు. వీటన్నింటికీ కోవిడ్ పాజిటివ్ సమయంలో స్టెరాయిడ్స్ వాడకం ఒక కారణమైతే, కోవిడ్ వైరస్ వల్ల కూడా ఈ సమస్యలు వస్తున్నాయని వెల్లడించారు. ఎప్పుడూ డాక్టర్‌ను సంప్రదించి, వారి సూచనల మేరకు మాత్రమే మందులు వాడడం మంచిదన్నారు. కోవిడ్ వచ్చి తగ్గిన వారు నీరసం ఉందని రోజు వారీ వ్యాయామం చేయడం మానేయకూడదని సూచించారు. రోజూ ఎంతో కొంత వాకింగ్ చేస్తూ ఉండాలన్నారు. కొన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని, మంచి ప్రోటీన్ ఫుడ్ తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా యాక్టివ్‌గా ఉండేలా చూడాలని, అవసరం మేరకు మాత్రమే విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.
















డాక్టర్స్ డే శుభాకాంక్షలు
MAHARAJAH'S INSTITUTE OF MEDICAL SCIENCES
మిమ్స్ జనరల్ హాస్పిటల్
నెల్లిమర్ల
జనరల్ వైద్య సేవలు
కంటి విభాగము
చెవి, ముక్కు, గొంతు విభాగము
కీళ్ళు మరియు ఎముకల విభాగము
ఫిజియోథెరిపి, దంత విభాగము
మానసిక వ్యాధుల విభాగము
ఛాతీ మరియు ఊపిరితిత్తుల విభాగము
చర్మ వ్యాధుల విభాగము
చిన్నపిల్లల విభాగము
స్త్రీ మరియు ప్రసూతి విభాగము
శస్త్ర చికిత్స విభాగము
1 st in Vizianagaram
సదా మీ ఆరోగ్య పరిరక్షణలో...
మిమ్స్ కన్నతల్లి పథకం
ప్రసవమునకు వచ్చు గర్భిణీలకు మిమ్స్‌లో మాత్రమే వర్తించును.
ఈ ఆసుపత్రిలో డా॥ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, EHS, ESI సేవలు ఉచితముగా అందించబడును.
సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
మూత్రకోశ వ్యాధి నిపుణులు
చిన్న పిల్లల శస్త్ర చికిత్స నిపుణులు
గుండె జబ్బుల వైద్య నిపుణులు
కిడ్నీ సంబంధిత వైద్య నిపుణులు
మెదడు, నరముల వైద్య నిపుణులు
జీర్ణకోశ వైద్య నిపుణులు
పసికందుల వైద్య నిపుణులు
అత్యాధునిక పరికరాలతో ఆపరేషన్ థియేటర్
తొలిసారిగా విజయనగరంలో అత్యాధునిక వైద్య పరిరక్షణలో..
HIGH END MRI-1.5 TESLA (INFINITY CHANNEL)
C.T. GE - 16 SLICE
ULTRA SOUND 3D, 4D ELLASTROGRAPHY
LIGHT SHEER DESIRE LASER
FRACTIONAL CO2 LASER SYSTEM
DLCO
అత్యాధునిక అంబులెన్స్ సౌకర్యం కలదు
08922 - 24 4 365
Hours
Days
ఇప్పుడు మిమ్స్ మన విజయనగరంలో
పాత బి.యస్.ఎన్.ఎల్. ఆఫీసు, పోస్టాఫీస్ దగ్గర